నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

బుధవారం | 14 ఆగస్టు 2024 | www.navatelangana.com

సదాశివపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీజీపీ

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పోలీస్ స్టేషన్‌ను డీజీపీ జితేందర్, మల్టీ జోన్ టూ ఐజి సత్యనారాయణలు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. 100 డయల్ కేసుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ మహేష్ గౌడ్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ సద్భావ జ్యోతి యాత్రకు ఘన స్వాగతం

నవతెలంగాణ-సదాశివపేట



రాజీవ్ సద్భావ జ్యోతి యాత్రకు మండలంలోని ఆరూరు గ్రామం వద్ద తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనను నాయకులు పటుకొని ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయాలకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూలకంటి అంజనేయులు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడిల రామ్ రెడ్డి, మండల అధ్యక్షుడు సిద్ధన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, పట్టణ అధ్యక్షుడు మున్నిపల్లి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ లు పిల్లోడి విశ్వనాథ, పట్లూరి నాగరాజుగౌడ్, గుండు రవి, నాయకులు చిరు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది

నవతెలంగాణ-మునిపల్లి



విద్యాభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణవేణి మరియు క్యూపీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో అందించిన టీ షర్ట్స్, టై బెల్టులను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు ఉపాధ్యాయులు అండగా నిలవడం నిజంగా ప్రశంసనీయమన్నారు. మండల నోడల్ అధికారి భాస్కర్ స్థానిక ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ అనసూయ తదితరులు పాల్గొన్నారు

బదిలీపై వెళ్తున్న వెటర్నరీ డాక్టర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో రెండేండ్లుగా వైద్య సేవలందించి బదిలీపై వెళ్తున్న వెటర్నరీ డాక్టర్.దినకర్ పాల్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో బదిలీపై ఇక్కడికి వచ్చిన డాక్టర్ విశాల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశాల్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయం

నవతెలంగాణ-పుల్కల్



మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర ప్రాతినిథ్య వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటన జరగడం గమనార్హం. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో ఓ వ్యక్తి ఆరెంజ్ పల్ప్ కొనుగోలు చేశాడు. అయితే ఆ సీసాను గమనించగా జూన్ 28నే ఆ కూల్‌డ్రింక్ కాలం చెల్లినదిగా ఉండటాన్ని గమనించి అవాక్కయ్యాడు. ప్రాణాలకు హాని కలిగించేలా కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ ఏంటని వాపోయాడు. కిరాణా దుకాణంలో ఇంత యథేచ్ఛగా కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్నా అధికారులు స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మండలంలోని ప్రతీ షాపును తనిఖీ చేసి ప్రజలకు తగిన న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూడ్చిన శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు

- 13 రోజుల క్రితం మృతి చెందిన బాలికకు పోస్టుమార్ట

నవతెలంగాణ-టేక్మాల్



ఫైల్‌ఫోటో

అనుమానస్పద స్థితిలో మృతి చెందిన బాలిక శవాన్ని 13 రోజుల తర్వాత పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కంప్లూర్ గ్రామానికి చెందిన గోశిక సుప్రజ (16) మెదక్ లో బైపిసి మొదటి సంవత్సరం చదువుతుంది. జూలై 30వ తేదీన స్వగ్రామం తంప్లూర్‌కు వచ్చింది. ఒకటవ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో దూలానికి ఉరివేసుకొని బాలిక సుప్రజ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మధ్యాహ్న 3 గంటలకు బాలిక (గోశిక . సుప్రజకు) శవాన్ని పూడ్చిపెట్టారు. అనంతరం టేక్మాల్ పోలీస్ స్టేషన్లో మేనమామ సాయిలు బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పులివైన ప్రవీణ్‌పై అనుమానాలు ఉన్నాయని, అతనిని విచారిస్తే నిజాలు బయటపడతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. శవాన్ని పోస్టుమార్టం చేస్తామని పోలీసులు తెలపడంతో తన ఫిర్యాదును వాపస్ తీసుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు సుప్రజ మరణాన్ని చాలెంజ్‌గా తీసుకొని పోస్టుమార్టం నిర్వహిస్తామని కుటుంబీలకు తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ డాక్టర్లకు సమాచారం అందించి 13 రోజుల తర్వాత మంగళవారం పూడ్చిపెట్టిన గోశిక సుప్రజ శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఏఎస్ఐ తుక్కయ్యలు పర్యవేక్షించారు.

కేరళ వరద బాధితులకు అండగా నిలుద్దాం

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్



నవతెలంగాణ-కొమురవెల్లి

కేరళ వరద బాధితులకు అండగా నిలుద్దామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కేరళ వరద బాధితులకు అండగా నిలించేందుకు మంగళవారం స్థానిక కొమురవెల్లి మెయిన్ రోడ్డు షాపుల వద్దకు రైతు సంఘం కార్యకర్తలు నిధుల సమీకరణ చేపట్టారు. అనంతరం మూడ్ శోభన్ మాట్లాడుతూ కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికి పైగా మృత్యువాతపడ్డారని, వందలాది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొంతమంది జాడ కానరావడం లేదని బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి పూర్తిస్థాయి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా విరివిగా ఆర్థిక సహకారం అందజేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలంతా బాధితులకు ఉదారంగా విరాళాలిచ్చి సంఘీభావాన్ని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నక్కల యాదవ రెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రాంనగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, రైతు సంఘం నాయకులు ఆరుట్ల రవీందర్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులకు గాయాలు

నవతెలంగాణ-కొల్చారం



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారి కొల్చారం పోలీస్టేషన్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధ దంపతులు వైద్య చికిత్సల నిమిత్తం కోసం కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాలినడకన వస్తుండగా అకస్మాత్తుగా వెనుకనుంచి వస్తున్న స్కూటీ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో ఇద్దరి వృద్ధులకు తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ మహ్మద్ గౌస్ వెంటనే క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

అప్పుల ఊబిలో... పంచాయతీ కార్యదర్శులు



- పంచాయతీల నిర్వహణలో అప్పుల పాలు
- ఆర్నెళ్లుగా కార్యదర్శులపైనే నిర్వహణ బాధ్యత
- సర్పంచ్‌లకు అందని జనరల్ ఫండ్, ఈజీఎస్ బిల్లులు
- చిన్న జీపీకి రూ.50...మేజర్ పంచాయతీకి లక్షపైనే ఖర్చు
- ట్రాక్టర్ల డిజీల్, బ్లీచింగ్, లైట్స్, పైపులైన్, రిపేర్లకూ అప్పులే
- మా వల్ల కాదంటూ ఎంపీడీఓలకు వినతులు

> గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం నాడు సర్పంచ్‌లు...నేడు సెక్రటరీలు అప్పుల పాలయ్యారు. గ్రామ పంచాయతీల నిర్వహణలో ప్రజలకు సంబంధించిన కనీస అవసరాల్ని తీర్చేందుకు చిల్లి గవ్వ కూడా జీపీ ఖాతాల్లో లేవు. ఆర్నెళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూపాయి బిల్ల కూడా విడుదల కాలేదు. అయినా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు వడ్డీలకు అప్పు చేసి ప్రజల అవసరాలు తీర్చుతున్నారు. సర్పంచ్‌లేమో జనరల్ ఫండ్స్, ఈజీఎస్ నిధులకు సంబంధించిన పనులు చేసి బిల్లులు రాక అప్పు ఊబిలో కూరుకుపోయారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలకు రావాల్సిన నిధుల్ని పాలకులు దారి మళ్లించడం వల్ల గ్రామ పంచాయతీల్లో మూరెడు పైప్, బల్బులు కూడా కొనలేని దుస్థితికి నెట్టబడ్డాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ జిల్లాలోని చిన్న శంకరంపేట మండలంలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. శంకరంపేట, సూరారం, మడూరు, శాలిపేట, దరిపల్లి, చందంపేట పెద్ద గ్రామ పంచాయతీలు కాగా బాగిర్తిపల్లి, కామారం, చిన్నయిపల్లి చిన్న పంచాయతీలున్నాయి. మిగతా వెయ్యి పన్నెండు వందల ఓటర్లు కల్గిన పంచాయతీలున్నాయి. శంకరాజికొండాపూర్ గ్రామంలో 2000 జనాభా 13 మంది ఓటర్లున్నారు. ఊర్లో జనాభాకు రోజూ మంచినీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ వంటి పనులు చేసేందుకు పంచాయతీ కార్యదర్శి అప్పులు చేయాల్సి వస్తుంది. గతంలో సర్పంచ్, పాలక వర్గం ఉన్నప్పుడు గ్రామ అవసరాలకు సంబంధించిన వస్తువుల్ని మండల కేంద్రంలో ఉద్దెర పద్దులో తెచ్చి బిల్లులు రాగానే చెల్లించేది. ఆర్నెళ్లుగా సర్పంచ్‌లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శినే అన్ని తానై చూసుకోవాల్సి వచ్చింది. ఇటీవల పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లారు. కొత్త కార్యదర్శి అదే పద్ధతిలో అప్పులు చేసి పంచాయతీ నిర్వహణ పనులు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్నేళ్లుగా అప్పులే

గ్రామ పంచాయతీల ఐదేళ్ల పదవి కాలం జనవరి 31తో ముగియడంతో ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన పెట్టారు. ఆర్నెళ్లుగా పంచాయతీ కార్యదర్శులకు పైసా నిధులు రాకపోయే సరికి అప్పులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణలో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లకు డీజిల్, వీధిలైట్లు, పారిశుద్ధ్య నిర్వహణలో బ్లీచింగ్ పౌడర్, సిబ్బంది జీతభత్యాలు, నల్లాలు, పైప్‌లైన్ల మరమ్మతులు, కరెంట్ మోటర్, ట్రాక్టర్ రిపేర్లతో పాటు సమావేశాలు జరిపినా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చినా టీ, బిస్కెట్స్, వాటర్ కోసం అయ్యే ఖర్చులకు ఏలాంటి నిధులు రాలేదు. వీటిని సమకూర్చకపోతే ప్రజలు లొల్లి చేయడం, ఉన్నతాధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేల బెదిరింపులు తప్పట్లేదు. దీంతో కార్యదర్శులే వడ్డీకి అప్పు తెచ్చి పంచాయతీల్ని నడుపుతున్నారు. 500 నుంచి 600 జనాభా కల్గిన చిన్నపాటి పంచాయతీకైతే కనీసం నెలకు రూ.30 నుంచి రూ.50 వేల ఖర్చు వస్తుంది. రెండు వేల జనాభా కల్గిన పంచాయతీలకైతే కనీసం లక్ష రూపాయలైనా ఖర్చులకు కావాలి. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం అద్దె బోర్లు, పైప్‌లైన్ల విస్తరణ పనులు చేశారు. పచ్చదనం, స్వచ్ఛదనం పేరిట చేపట్టిన స్పెషల్ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇలా ఆర్నెళ్ల గా నెలా నెలా సొంత డబ్బులు, లేదంటే అప్పు ఖర్చు చేస్తున్నామని పలువురు కార్యదర్శులు పేర్కొంటున్నారు. తాము పెట్టిన ఖర్చుల బిల్లులు ఎప్పుడు వస్తాయో రావో తెల్వట్లేదని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో కార్యదర్శులు తమపై భారం పడుతుందని ఎంపీడీఓలకు వినతి పత్రాలిచ్చారు.

పంచాయతీలకు పైసా ఇవ్వని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా కూడా విధిల్చడంలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. సంగారెడ్డి 647, సిద్దిపేటలో 469, మెదక్‌లో 499 పంచాయతీలున్నాయి. వీటికి ఆర్నెళ్లుగా పాలక వర్గాల్లేని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సాధారణ ఫండ్స్, ఈజీఎస్ నిధుల్ని కూడా విడుదల చేయట్లేదు. పంచాయతీకు కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నుంచి జనాభాను బట్టి నిధులు కేటాయిస్తారు. చిన్న పంచాయతీలకైతే కనీసం రూ.3 నుంచి 5 లక్షలు, పెద్ద పంచాయతీలకు ఆరేడు లక్షల వరకు నిధులు వచ్చేవి. అలాగే పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం సాధారణ ఫండ్స్‌తో పాటు ఉపాధి హామీ నుంచి నిధులు మంజూరవుతాయి. అవి కూడా రావట్లేదు. ఆర్నెళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలో జీపీ ఖాతాల్లో రూపాయి బిల్ల కూడా పడలేదు.

అప్పుల పాలైన మాజీ సర్పంచ్‌లు

ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసిన మాజీ సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. పదవి కాలంలో గ్రామాభివృద్ధి కోసం సాధారణ ఫండ్స్, ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠదామాలు, హరిత హారం నర్సరీలు, అంతర్గత రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు మోటర్లు, పైప్‌లైన్ల విస్తరణ వంటి పనులు చేశారు. వాటికి సంబంధించిన బిల్లులు ఇంత వరకు రాలేదు. ఒక్కో పంచాయతీలో ఐదారు లక్షల వరకు పెండింగ్ బిల్లులు గత ప్రభుత్వంలో విడుదల కాలేదు. దీంతో సర్పంచ్‌లంతా రోడ్డెక్కి ఆందోళన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బిల్లులిస్తామని చెప్పింది. అందుకే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సర్పంచ్‌లు ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. అయినా బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ మల్లేశం తెలిపారు.

నిర్వహణ కష్టమవుతోంది:

జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు

పంచాయతీలకు నెల వారిగా అయ్యే ఖర్చులకు బడ్జెట్ రావడంలేదు. ప్రత్యేక పాలన వల్ల కేంద్రం నుంచి నిధులు నిలిచిపోయాయి. బ్లీచింగ్, డీజిల్, వీధిలైట్లు, రిపేర్లకు అయ్యే ఖర్చులకు కార్యదర్శులు సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుంది. చాలా మంది అప్పులు చేస్తున్నారు. బిల్లులు వస్తే కాస్త భారం తగ్గుద్ది.

తాగునీటి సరఫరాలో రెండ్రోజుల పాటు అంతరాయం

సంగారెడ్డి కమిషనర్ ప్రసాద్ చౌహాన్


నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలో నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయ కలుగుతుందని సంగారెడ్డి మున్సిపల కమిషనర్ ప్రసాద్ చౌహాన్ అన్నారు. సంగారెడ్డి పట్టణానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేయుటలో భాగంగా 100 ఎంఎల్‌డి కెపాసిటీ పరిధిలోని పోలకంపల్లి బుదేర గ్రామాల పరిధిలో 1200 ఎంఎం డయా పంపింగ్ మెయిన్‌కి లీకేజ్ ఏర్పడిందన్నారు. అత్యవసరంగా లీకేజీని అరికట్టుటకు రెండ్రోజుల సమయం పడుతుందన్నారు. కాబట్టి నేడు రేపు సంగారెడ్డి పట్టణానికి నీటి సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వార్డ్ నెంబర్ 33 34 రెవెన్యూ ట్యాంక్, వార్డ్ నెంబర్ 30 37 అహ్మద్ నగర్ ట్యాంక్, వార్డ్ నెంబర్ 8 27 28 29 సాయినగర్ ట్యాంక్, వార్డ్ నెంబర్ 6 7 25 26 38 చైతన్యపురి ట్యాంక్, జిలాల్బాగ్, వార్డ్ నెంబర్ 35 15 16 విజయనగర్ కాలనీ ట్యాంక్, వార్డ్ నెంబర్ 35 14 తార ట్యాంక్, వార్డ్ నెంబర్ 12 ఓడిఎఫ్ ట్యాంక్ 9 29 విద్యానగర్ ట్యాంక్ వార్డ్ నెంబర్ 12 మంజీరా హాస్పిటల్ ట్యాంక్, వార్డ్ నెంబర్ 11 కొత్తలాపూర్ రోడ్ ట్యాంక్, వార్డ్ నెంబర్ 10 సండే మార్కెట్ ట్యాంక్, 32 12 ఎం ఐ జి సంపు, వార్డ్ నెంబర్ 31 32 విద్యానగర్ సంపు, వార్డ్ నెంబర్ 4 5 23 24 గంజి మైదాన్ ట్యాంక్ ఈ ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తారన్నారు. మంచినీటి సరఫరా అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ధరణి భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-కొండాపూర్



మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు స్థానిక తహసిల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. ధరణి భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని.. అవి అత్యధికంగా సన్న, చిన్నకారు రైతులవే అన్నారు. ధరణి సమస్యలు పరిష్కారం కాక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మారినా ధరణిలో రైతుల సమస్యలు పరిష్కారం గాక ఇబ్బందులు తప్పట్లేదని వాపోయారు. కొండాపూర్ మండలంలోని అసైన్డ్ భూములను కాపాడాలని.. అలాగే అసైన్ భూవులను రైతులకు పట్టా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టించుకోని రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాజయ్య, మండల నాయకులు బాబు రావు,వెంకయ్య, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ప్రభుత్వ బ్యాంక్ నెలకొల్పాలి

నవతెలంగాణ-కొండాపూర్



కొండాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ బ్యాంక్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ కొండాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మొహమ్మద్ పాషా, సురేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండాపూర్ మండల కేంద్రంలో ఇప్పటివరకు ప్రభుత్వ బ్యాంకులను ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకర మన్నారు. గ్రామాల నుంచి కొండాపూర్‌కు వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలకు బ్యాంకు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో బ్యాంకుల నెలకొల్పి ప్రజలు,విద్యార్థులు రైతుల ఇబ్బందులను తొలగించాలని జిల్లా సంబంధిత అధికారులను కోరారు. కొండాపూర్ మండల కేంద్రంలో బ్యాంకులు లేకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు అధిక వడ్డీలకు ప్రజలకు రుణాలు ఇస్తూ విద్యార్థులను, యువతను, ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. వెంటనే కొండాపూర్ లో ప్రభుత్వ బ్యాంకులను స్థాపించాలని.. లేని యెడల డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కొండాపూర్



విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా నాయకులు తలారి అర్జున్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ బాయ్స్ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఆ సమస్యల పరిష్కారం కోసం మండల విద్యాధికారి అందుబాటులో లేక పోవడంతో ఆయన కుర్చీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్ల సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల విద్యార్థులకు మెడికల్ చెకప్ చేయించాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరిచాలని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా.. పలు సందర్భాల్లో కనీసం కార్యాలయంలో కూడా ఆయన ఉండట్లేదన్నారు. కార్యాలయ సిబ్బంది కనీసం వినతిపత్రం కూడా తీసుకోవట్లేదన్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి.. ఎంఈఓ, ఆయన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, అరవింద్ పాల్గొన్నారు.

బీబీపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని బీబీపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు నారాయణఖేడ్‌డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సంధ్యారాణి తెలిపారు.ఈ పాఠశాలలో సోమవారం రోజున మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఈ మేరకు వారిని పరామర్శించి.. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిలో 20 మంది విద్యార్థులు ఉదయమే డిశ్చార్జ్ అయ్యారని.. ఇంకా నలుగురు విద్యార్థులు సాయంత్రం లోగా డిశ్చార్జ్ అవుతారని వైద్యులు తెలిపారు. అనంతరం బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల పరిశుభ్రత గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు డిప్యూటీ డిఎంహెచ్‌ఓ వివరించారు. పాఠశాలలోని అందరూ విద్యార్థులు ఆరోగ్యాంగానే ఉన్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని.. పరిశుభ్రత తప్పకుండా పాటించాలని ప్రధానోపాధ్యాయులకు, వంట మనుషులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ ఏరియా ఆస్పత్రి సూపరిడెంట్, సిర్గాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతిభ, ఎంఎల్ హెచ్పి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు జట్ల భాస్కర్, రాంచెందర్, ఏఎన్ఎం జయ,ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

- కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
- నేటి అర్ధరాత్రి జరిగే జన జాగరణను జయప్రదం చేయండి
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల



నవతెలంగాణ-సంగారెడ్డి

'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం అని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సంగారెడ్డిలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్ ప్రసాద్‌లు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని.. కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్రాన్ని, స్వాలంబనను తాకట్టు పెడుతున్నదన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిల పడుతున్నదని.. జాతీయ సంపదను లూటీ చేస్తున్నదన్నారు. ఎందరో త్యాగధనులు పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సిద్ధించిన స్వతంత్రాన్ని నిర్వర్యం చేస్తున్నదన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే బీజేపీ ప్రభుత్వం తన నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించేందుకు కంకణం కట్టుకున్నదన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ ద్వారా పెద్ద కార్పొరేట్లకు ఆర్థిక వెసులుబాటు కల్పించే చర్యలను వేగవంతం చేస్తున్నదన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా అనునిత్యం కార్పొరేట్ సంపన్నుల జపం చేస్తున్నదని విమర్శించారు. నాడు స్వతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని నేడు కార్మికవర్గం ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశాన్ని క్విట్ ఇండియా స్ఫూర్తితో కాపాడుకునే బాధ్యత దేశ ప్రజలపై ఉన్నదన్నారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సన్నద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 14న అర్ధరాత్రి వరకు జరిగే జన జాగరణలో కార్మిక వర్గం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు

- 12 రికార్డులు నిర్వహణ లేదు
- ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



నవ తెలంగాణ-సిద్దిపేట

ఏసీబీ డీజీపీ ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట పట్టణంలో గల బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్ లో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 12 రికార్డుల నిర్వహణ లేదని, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ నిర్వహణ కూడా సరిగా లేదని గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. మెదక్ రోడ్డులో గల బిసి ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఏసీబీ డీఎస్పీ బృందం, ఫుడ్ సేఫ్టీ, తూనికల కొలతలు, ఆడిట్, శానిటేషన్ ఇన్స్పెక్టర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బృందం హాస్టల్లో ఉన్న రికార్డులను, రిజిస్టర్‌లను, విద్యార్థులకు వండించే భోజన సరుకులను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పరిశీలనలో విద్యార్థులు హాస్టల్లో ఉండకుంటే వారి రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేయకుండా వార్డెన్ డాట్ పెడుతున్నారని తెలిపారు. జూన్, జూలై నెల సంబంధించిన అబ్స్ట్రాక్ట్ చేయలేదన్నారు. మూత్రశాలలకు డోర్లు లేవని, విద్యుత్ సౌకర్యం లేదని, 90 మంది ఆన్లైన్లో విద్యార్థులు ఉండగా, రిజిస్టర్ లో 71 మంది పేర్లే ఉన్నాయని తమ పరిశీలనలో తేలిందన్నారు. నిర్వహణ లోపం బాగా ఉందని తెలిపారు. రిపోర్టును పై అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారి శ్రీశిక, తూనికల కొలతలు అధికారి అనిల్ కుమార్, ఆడిట్ అధికారి సచిన్, శానిటరీ ఇన్స్పెక్టర్ సైదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
బుధవారం | 14 ఆగస్టు 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేకు జాతీయ పతాకాన్ని అందజేసిన తపాలాశాఖ అధికారులు

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు 'హర్ ఘర్ తిరంగ' పై అవగాహన కల్పించాలని పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నుంచి వచ్చిన సందేశాన్ని, జాతీయ పతాకాన్ని సంగారెడ్డి తపాలా శాఖ అధికారులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి పోస్టల్ డివిజన్ సూపర్డెంట్ ఎల్.వి మురళీ కుమార్, ఆర్సీపురం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి, అసిస్టెంట్ సూపర్డెంట్, స్వాగతిక ఫాలో, జహీరాబాద్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలోని గదులను తొలగించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్



రేజింతల్‌లో ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను వెంటనే తొలగించాలని జెడ్పీసీఈవో జానకిరెడ్డి.. పంచాయతీ సిబ్బంది, ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. రేజింతల్ ప్రభుత్వ పాఠశాల, గ్రామంలో పారిశుధ్యం, చెరువు, కుంటను ఎంపీడీవో సురేష్, ఈజీఎస్ ఏపిఓ రంగారావు, పంచాయతీ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సమస్యలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా జెడ్పీసీఈఒ మాట్లాడుతూ.. సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశుధ్య పనులపై దృష్టిపెట్టాలని కార్యదర్శికి సూచించారు. పాఠశాల ఆవరణంలోని పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించాలన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ అరుణ జ్యోతి, ఈజీఎస్ టీఏలు హనుమంతు, సిబ్బంది తదితరులున్నారు.



ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు నిర్వాసిత రైతులతో కలిసి సంగారెడ్డి ఎమెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాగా అదనపు కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా పెద్దపూర్, గిర్మాపూర్ ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఏండ్ల నుంచి సాగు చేస్తున్న భూములను అప్పజెప్పి.. తాము ఎలా బతికేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉన్న భూమంతా రోడ్డుకే పోతే.. రైతులు ఎట్లా బతుకుతారని వాపోయారు.భూమికి భూమి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. రైతులు మనోధైర్యంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

రామచంద్రాపురం అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి కార్పొరేటర్ పుష్ప నగేష్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. రామచంద్రాపురం డివిజన్‌లో సుమారు రూ.5.5 కోట్ల నిధులు అభివృద్ధి కోసం మంజూరు చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ విన్నవించారు. అవసరమైన పను లకు నిధులు వెంటనే మంజూరు అయ్యేలా చూస్తానని జలమండలి ఎండి హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నగేష్, మహీన్ గౌడ్, పీటర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ స్థలాన్ని కబ్జా చేస్తూ డ్రయినేజీ నిర్మాణం

పనులను అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం పారిశ్రామికవాడలోని ఎస్ రిచ్ పార్క్ స్థలంలో మరోసారి అక్రమంగా అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నారని వచ్చిన ఫిర్యాదులతో.. ఆ పనులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకు న్నారు. సర్వే నెంబర్, 84లోని పారిశ్రామిక వాడకు కేటాయించిన ఎస్ రిచ్ పార్క్ స్థలంలో ఇటీవల ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ కోణంలో బాచుపల్లికి చెందిన పలువురు పార్క్ స్థలాన్ని ఆక్రమిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతుండడంతో అధికారులు అడ్డుకున్నారు. పార్క్ స్థలం కబ్జాకు గురికాకుండా మున్సిపల్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



సీసీ రోడ్ల పరిశీలన

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మున్సిపాల్టీ పరిధిలోని గాంధీ విగ్రహం నుంచి జ్యోతి థియేటర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును, 11వ వార్డ్ బీరప్ప బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాంధీ విగ్రహం నుంచి జ్యోతి థియేటర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును, పలు వార్డులలో రోడ్లని నాణ్యతగా వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మున్సిపల్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ సిబ్బంది, ప్రసాద్, కృష్ణ, స్థానిక ప్రజలు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదలీలు సహజం

నవతెలంగాణ-మనూర్



ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం అని మనూర్ మండల యువ జన కాంగ్రెస్ నాయకులు బీరదార్ దత్తు అన్నారు. దోసపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ బదలీపై వెళ్లగా ఆయన స్థానంలో బాలు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. కొత్తగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి కి స్వాగతం పలుకుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు నారాయణ, జగన్నాథ్, ఈరశెట్టి కుశప్ప, శర్నప్ప, సత్యనారాయణ, జైరాజ్,అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

కారముంగిలో వైద్య శిబిరం



నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్ద మండలంలోని కారముంగి గ్రామంలో కారసగుత్తి ఆరోగ్య కేంద్రం వైద్యరాలు జారియా బేగం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. జ్వరం ఒచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చెత్త చెదారం లేకుండా పరిసరాలను శుభ్రంగా చూసుకోవాలన్నారు.ఈ వైద్య శిబిరంలో 50మందికి పరీక్షలు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్లే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదన్నారు. వ్యాధులు రాకముందే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన మహిళ మృతదేహం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం పారిశ్రామిక వాడలోని జెనెక్స్ పరిశ్రమ సమీపంలో ఓ మహిళా మృతదేహం స్థానికంగా కలకలం రేపింది. బొల్లారం సిఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అస్రతి కాతూన్(25)ను కాళ్లకు బట్టతో కట్టి దారుణంగా గొంతు నులిమి హత్య చేసినట్టుగా పోలీసులు గుర్తించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహానికి క్లూస్ టీం సభ్యులు విచారణ చేపట్టారు. మహిళకు సంబంధించి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లయితే పోలీసులకు 8712656729 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సిఐ గంగాధర్ తెలిపారు.



ఉమ్మడి కల్హేర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పోటీలో స్వామిదాస్

నవతెలంగాణ-కల్హేర్

స్థానిక నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ ఆశీర్వాదంతో ఉమ్మడి కల్హేర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న స్వామిదాస్‌కు పెద్ద ఎత్తున ఓటేసి గెలిపించాలని పలువురు కల్హేర్, నిజాంపేట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గెలుపోటమిలతో సంబంధం లేకుండా పార్టీ సిద్ధాంతాలను నమ్ముకొని ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వామిదాస్ పనిచేశారన్నారు. కాబట్టి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన్ను గెలిపించుకోవాలన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ మన బాధ్యత

- తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి(డీజీపీ) డా.జితేందర్
- జిల్లా పోలీసు కార్యాలయ సందర్శన

నవతెలంగాణ-సంగారెడ్డి



శాంతి భద్రతల పరిరక్షణ మన భాధ్యత అని, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ జితేందర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మల్టీ జోన్-2 ఐజీ వి.సత్యనారాయణ తో కలిసి మొక్కలు నాటారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ సెక్షన్‌లను, నూతనంగా ప్రారంభించిన సైబర్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్‌లను ఆయనకు చూపించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ మాట్లాడుతూ.. డీపీఒ కార్యాలయాన్ని ఆధునీకరించిన తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపారు. జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకున్న చర్యలు జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఎస్-ఎన్ ఏ బి గురించి డీజీపీకి వివరించారు. పోలీసు అధికారులు ఒక్కొక్కరితో డీజీపీ మాట్లాడుతూ.. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, హిస్టరీ షీటంస్, శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం వలన పొరుగు రాష్ట్రాల నుండి ఎక్కువ అక్రమ రవాణా జరగటానికి అవకాశం ఉన్నందున వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ద్వారా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. నేరస్తులకు కోర్టులో శిక్ష పడినప్పుడే, నేరస్తులు తిరిగి నేరం చేయడానికి భయపడతారని, అదేవిధంగా ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలు ఉన్నట్లయితే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సత్సంబంధాలు కలిగినప్పుడే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని గుర్తు చేశారు. జిల్లాలో ఎవరైనా మట్కా నిర్వహిస్తున్నట్టు గాని, గంజాయి సాగు, అక్రమ రవాణా చేస్తున్నట్లుగాని, మట్కా, పేకాట ఆడుతున్నట్లుగాని గుర్తిస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు బ్లింకింగ్ లైట్స్, బోలార్డ్స్ ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. అనుక్షణం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డయల్-100 కాల్స్ విషయంలో బ్లూకోర్ట్ సిబ్బంది త్వరితగతిన స్పందించాలన్నారు. అధికారులు, సిబ్బంది పోలీసు స్టేషంకు వచ్చిన వారితో సత్:ప్రవర్తనతో ఉండాలని సూచించారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యల గురించి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలకు ఏర్పాటు చేసిన ఎస్-ఎన్ ఏ బి అభినందనీయమని, దీని ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కొరకు చేపట్టిన మై ఆటో సేఫ్ కార్యక్రమం మంచి కార్యక్రమం అని, పరిశ్రమల రక్షణ, ఉద్యోగుల రక్షనార్థమై (సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ చేస్తున్న కృషి, సంగారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగం పనితీరును అభినందించారు. అనంతరం ఉత్తమ పనితీరును కనబరిచిన రామ్ మోహన్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఇన్‌స్పెక్టర్ మల్లేశం, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, శ్రీకాంత్ ఎస్ఐ, ఆసిఫ్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ప్రభాకర్ జానకిరామ్, ఆర్ఐ హన్మిరెడ్డి, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, ఏఒ కళ్యాణి, సూపరింటెండెంట్ వెంకటేశం, విజయ్ పవార్, సీసీలకు రివార్డులు అందించారు.ఈ కార్యక్రమంలో మల్టీ జోన్-2 ఐ.జి వి.సత్యనారాయణ, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, జిల్లా ఇన్‌స్పెక్టర్స్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య..

ఓ యువతీ ఆత్మహత్య కేసులో నిందితుడు కావడంతో.. భయంతో బలవన్మరణం

నవతెలంగాణ-గుమ్మడిదల



(ఫైల్)

బీ ఫార్మసీ విద్యార్థిని తేజస్విని ఆత్మహత్య కేసులో నిందితుడిగా ఉన్న శ్రీహరి అనే యువకుడు భయంతో మంగళవారం రోజున పురుగుల మందు తాగి బలవన్మరణం చేసుకన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో తనను, తన కుటుంబ సభ్యులను శ్రీహరి(25) వేధిస్తున్నాడనే నెపంతో గుమ్మడిదల మండల పరిధిలోని దోమడుగు గ్రామానికి చెందిన తేజస్వినిని గత శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నది. ఈ నేపథ్యంలో శ్రీహరి కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. అతని కుటుంబ సభ్యులు గమనించి సూరారం మల్లారెడ్డి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే సోమవారం రాత్రి తేజస్విని కుటుంబ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ తీసి..శ్రీహరి కుటుంబాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అది చూసిన ఆ యువకుడు భయాందోళనకు గురై సోమవారం రాత్రి ఆసుపత్రి నుంచి పరారయ్యాడు. దుండిగల్ బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అర్హులైన ప్రతీ కుటుంబానికి రైతు రుణమాఫీ

నవతెలంగాణ-ఝరాసంగం

అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి తప్పనిసరిగా రుణమాఫీ చేయడం జరుగుతుందని జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి అన్నారు. రుణమాఫీ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారితో మండల పరిధిలోని కెనరా బ్యాంకు బర్దిపూర్ శాఖ సందర్శించి అధికారులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీలో భాగంగా ఇప్పటికే రెండు విడుతల్లో లక్షన్నర వరకు రైతుల రుణాలు మాఫీ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు తమ పేరు రుణమాఫీలో లేదని ఫిరాయిదులు చేస్తున్నారన్నారు. అయితే బ్యాంక్ అకౌంట్ నెంబర్లలో తప్పులు, ఆధార్ వివరాలు సరిపోలేకపోవడం, పంట రుణాలు రెన్యువల్ లాంటి వివిధ సాంకేతిక కారణాలతో కొందరికి రైతు రుణమాఫీ జరగలేదన్నారు. ఇప్పటివరకు రెండు విడతల్లో కలిపి శాఖ యందు ఐదు కోట్లు నిజమయ్యాయని, ఇందులో మూడు కోట్లు రైతుల అరుణ ఖాతాలలో జమ చేయడం జరిగిందని బ్యాంక్ అధికారులు తెలిపారన్నారు.

ప్రమాదకరంగా మామిడివాగు కల్వర్టు

- వర్షాకాలంలో కల్వర్టు పై నుంచి వెళ్లడం సాహసమే..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానిక రైతులు, వాహనదారులు
- నూతనంగా హై లెవల్ బ్రిడ్జీ నిర్మించాలని వేడుకోలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రేజింతల్-ఎల్గోయి గ్రామాల మధ్య గల మామిడివాగు కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమా దకరంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే ఆ బ్రిడ్జీపై నుంచి వెళ్లడానికే ప్రజలు జంకుతున్నారు. ఆ సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి.. నూతనంగా హైలెవల్ బ్రిడ్జీ నిర్మించాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

రేజింతల్, ఎల్గోయి, ఝరాసంగం, బర్దిపూర్, రేజింతల్ సిద్ధి వినాయక, పొట్టిపల్లిలో ప్రసిద్ధిగాంచిన ఆలయాలకు వెళ్లే భక్తులు ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. అయితే వర్షాకాలంలో కల్వర్టు పై నుంచి నీరు వెళ్లడం.. ఆ కల్వర్టు శిథిలావస్థలో ఉండడంతో అటు వైపుగా వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు ప్రాణలు అరచేతిలో పెట్టుకుని కల్వర్టు దాటుతుండగా.. మరికొందరు ప్రయాణాల ను వాయిదా వేసుకోవాల్సి దుస్థితి నెలకొన్నది. సిద్ధివి నాయక, పొట్టిపల్లి ఆలయానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కల్వర్టు పై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే కల్వర్టుపై గతంలో ప్రమాద ఘటనలు కూడా జరిగాయి. గతేడాది ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించినా.. ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమ వున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కొత్తగా హైలెవల్ బ్రిడ్జీ నిర్మిస్తే ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

హై లెవల్ బ్రిడ్జ్ కోసం రోడ్డు రవాణా ప్రధాన కార్యాలయానికి గత సంవత్సరంలోనే ప్రతిపాదనలు పంపిం చాం. కొత్త బ్రిడ్జీ పనులకు మూడు కోట్లు అవసరమని.. మంజూరు వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– సంధ్యారాణి, ఆర్‌అండ్‌బీ

కొత్త బ్రిడ్జీ నిర్మించాలి



భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జీపై నుంచి రాకపోకలు ఆగిపోతున్నాయి. సమీప పొలాల రైతులకు కష్టంగా మారుతున్నది. పంట పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది అవుతున్నది. కొత్త బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలి.

-వినోద్ రెడ్డి, రేజింతల్ రైతు

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

- మంత్రి సీతక్కను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతన రోడ్ల నిర్మాణాలు, రహదారుల మరమ్మతుల నిమిత్తం 60 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విన్నవించారు. రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలంటూ మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ఆయన . ప్రధానంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో నూతన కాలనీలో ఏర్పాటు అవుతున్న తరుణంలో రహదారుల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నూతన రహదారుల నిర్మాణానికి 43 కోట్ల రూపాయలు, రహదారుల మరమ్మత్తులకు 17 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క త్వరలోనే ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములను కాపాడాలి

- కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి
- అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మండలంలోని బీరంగూడ, కిష్టారెడ్డిపేట, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని, అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అమీన్‌పూర్ మండల కార్యదర్శి జార్జ్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు, చెరువులు కుంటలు కాలువలు, దేవాదాయ భూములు స్మశాన వాటికలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం కూడా పట్టించుకోకుండా చూసిచూడనట్టుగా వ్యవహరిన్నదని ఆరోపించారు. భవిష్యత్ తరాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు భూములు లేకుండా ప్రభుత్వ భూములను అక్రమదారులు కబ్జా చేస్తున్నారని వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే చెరువులు, కుంటలు కాలువలు స్మశాన వాటికలు, గుడి భూములవేటిని కూడా అక్రమదారులు వదిలివేయడం లేదన్నారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా. ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అక్రమదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని యెడల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలో కేజిఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని హనుమాన్ మందిర్ నుంచి కొత్త బస్ స్టాండ్ వరకు భారీ ఎత్తున ప్రజలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఇంటి మీద తిరంగా జెండా ఎగరడం వలన తెలియకుండానే జాతీయతా భావం, దేశభక్తి పెంపొందుతుందన్నారు. అలాగే స్వాతంత్ర సమర యోధులకు ఘన నివాళులు అర్పించడం అవుతుందని, కులమత భేదాలకు, ఆర్థిక అసమానతలకు అతీతంగా దేశంలో ఉన్న ప్రతి ఒక్కరు ఘనంగా ఈ స్వాతంత్ర దినోత్సవ పండుగ జరపాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టీ. రవీందర్ రెడ్డి, మేఘన రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, నరేందర్, అఖిల్, యోగి, శివ భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

జన జాగరణను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-హత్నూర



కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన జన జాగరణను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామంలో జన జాగరణ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడాలని.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 9న జన జాగరణ కార్యక్రమం ప్రారంభమై ఆగస్టు 14 అర్ధరాత్రి వరకు జరుగుతుందన్నారు. కార్మికులు, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ల ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్రాన్ని, స్వావలంభనను తాకట్టు పెడుతున్నదన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిలపడుతూ జాతీయ వనరులు, సంపాదనను లూటీ చేస్తున్నదని మండిపడ్డారు. భారతదేశాన్ని క్విట్ ఇండియా స్ఫూర్తితో కాపాడుకునే బాధ్యత దేశ ప్రజలపై ఉన్నదని.. దేశాన్ని రక్షించుకునేందుకు పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాల్లో జన జాగరణ కార్యక్రమాలకు మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి రాష్ట్ర కోశాధికారి మంగ, సీఐటీయూ నాయకులు షబ్బీర్, శేఖర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



రూ.1,20,000 సొంత నిధులతో సరస్వతి విగ్రహ వితరణ

నవతెలంగాణ-జిన్నారం

మాదారం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మాదారం మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో రూ.1,20,000 సొంత నిధులతో సరస్వతి విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేసినట్టు బీఆర్ఎస్ మాదారం అధ్యక్షులు గణేష్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆగస్టు 15వ తేదీన సర్పంచ్ సరిత సురేందర్‌గౌడ్ నేతృత్వంలో ప్రారంభోత్సవం చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
3
మెదక్
బుధవారం | 14 ఆగస్టు 2024 | www.navatelangana.com

విద్యా వాలంటరీ నియామకం పై ఆశలు

నవతెలంగాణ- టేక్మాల్

ఉపాధ్యాయుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యా వాలంటీర్ల నియామకం చేపట్టాలని అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల పేరుతో విద్యా వాలంటీర్లను నియామకం పై ఆమోదం లభించింది. కావున మెదక్ జిల్లాలో టేక్మాల్ మండలంలో కూడా ప్రభుత్వ పాఠశాలలో వెంటనే విద్యా వాలంటరీ నియమించాలని కోరుచున్నారు. జిల్లాలో ఇటీవల బదిలీలు, పదోన్నతులతో బడులలో చాలాచోట్ల ఖాళీలు ఏర్పడినచోట వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడం వలన సరియైన బోధన జరగడంలేదని, నూతన డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వచ్చేంతవరకు గతంలో పనిచేసిన విద్యా వాలంటీర్లను జిల్లా కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపాలని నిరుద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని అదేవిధంగా నిరుద్యోగులకు కూడా అవకాశం లభిస్తుందని కోరుకుంటున్నాను. విద్యా వాలంటీర్ల నియామకం కోసం ఎప్పటినుంచి ఎదురుచూస్తున్నామని పరిపాలన అధికారి చొరవ తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని గతంలో పనిచేసిన విద్యా వాలంటీర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది.

గురుకుల విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ- కౌడిపల్లి

స్థానిక కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మితంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లు, వంటగది, బెడ్రూంలు, మరుగుదొడ్లు, డ్రైనేజీనీ, పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుకులాల విద్యార్థులకు ఎలాంటి సమస్య రానీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల శుభ్రంగా ఉంచాలని, నాణ్యతతో కూడిన వసతి భోజనం కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాల కళాశాలకు రావాలని, చక్కగా చదువుకోవాలని చదువు మనిషిని ఉన్నతంగా నిలబెడుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం ఇవ్వాలి

- గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలి
- తెలంగాణ ఐకేపీ వివోఏల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు నగేష్

నవతెలంగాణ-మెదక్ టౌన్

ఐకేపీ వీవోఏల మెదక్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం కేవల్ కిషన్ భవనంలో లలిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నగేష్ పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామస్థాయిలో మెదక్ జిల్లా వ్యాప్తంగా ఐదు వందలకు పైగా వీవోఏలు (గ్రామ సంఘాల సహాయకులు) పని చేస్తున్నారు. అన్ని మహిళల అభివృద్ధికి మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అవగాహన కల్పిస్తున్నారు. 20 ఏళ్ల నుంచి గ్రామాలలో మహిళల అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తూ, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి వారికి లోన్స్ ఇప్పించి తిరిగి సక్రమంగా లోన్స్ చెల్లించే విధంగా ఐకెపి వీవోలు ప్రోత్సహిస్తున్నారు అన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తూ ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్‌లు పెట్టి అన్ని సంఘాలు ఆన్ లైన్ ఎంట్రీ చేస్తున్నారన్నారు. మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి పదేళ్ల దాటినా వీవోఏల బతుకులు ఏమి మారలేదు అన్నారు. వీవోఏలను సెర్ప్ నుంచి కేవలం ఐదువేల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గ్రామ సంఘం పుస్తక నిర్వాహన కొరకు ఎంపిక చేసిన వీవోఏలకు నేడు అనేక రకాల పనులు చేస్తున్నారన్నారు. ఎస్‌హెచ్‌జీ, వివో అకౌంటింగ్ ఎన్ఆర్‌యల్ఎం యాప్, లఘుపతి దీదీ లోకోస్ యాప్‌లతో ఆన్ లైన్ పనులు ఎలాంటి సౌకర్యం లేకుండా చేపిస్తూ రోజురోజుకీ పని భారం పెరుగుతుందన్నారు. ఎంతోమంది వీవోఏలు ప్రభుత్వం ఇస్తున్న అతి తక్కువ గౌరవ వేతనంతో కుటుంబాలు గడవక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీవోఏలు అనారోగ్యంతో, ప్రమాదాల వలన మరణిస్తున్నారని, కనీస బీమా సౌకర్యం లేక వివోఏల కుటుంబాలు రోడ్డును పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వివోఏలను సెర్ప్‌ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి వీవోఏకు రూ.10 లక్షలు సాధారణ భీమా సౌకర్యం, ఆరోగ్య భీమ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయని, వీవోఏలకు ఇచ్చే



కొద్దిపాటి వేతనం ఎటు సరిపోదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వీవోఏలకు ప్రతినెల రెగ్యులర్ వేతనాలు వ్యక్తిగత ఖాతాల ద్వారా ఇవ్వాలని, వీవోఏల వేతనాలు గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా చెల్లించాలని శ్రీనిధి ఇన్సెంటివ్ పెంచి వీవోఏళ్లకు ఇవ్వాలని అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, సెర్ప్ నుంచి రూ.5 వేలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల నుంచి రూ.3వేలు తీసుకోవాలని నిర్ణయించారు. అన్ని కానీ గ్రామ సంఘలకు ఆదాయం లేక అమలు కావడం లేదు అన్ని వీవోఏలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచాలని, పనిభారం తగించాలని ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కిష్టయ్య, స్వరూప, లక్ష్మి, అనురాధ, కవిత, మంజుల, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-చిన్న శంకంపేట

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు అన్నారు. మండలంలోని దరిపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. నాలుగో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మొదటిసారిగా ఎమ్మెల్యే పాఠశాలకు రావడంతో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బీరప్ప ఆలయం ఎదుట మొక్కలు నాటారు. మెదక్ నుంచి వచ్చిన న్యాయవాదులు పలు సమస్యల వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మానవ మునగడకు చెట్లే మూలాధారమని అన్నారు. నేటి మొక్కలే భవిష్యత్తు తరాల వారికి చెట్లు ఆక్సిజన్ అందిస్తాయని తెలియజేశారు. న్యాయవాదుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్యనారాయణ, శంకరంపేట మాజీ తాజా సర్పంచ్ రాజిరెడ్డి, గంగా నరేందర్, రంగారావు, మనోజ్ కుమార్, గుడ్డు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిలు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సైన్యం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, శాసన మండలి సభ్యులు యాదవ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లో నమోదు కాబడిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లేవనిత్తైన పలు ప్రశ్నలకు జిల్లా అధికారులు సమాధానం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపూర్ బాలరాజ్ గౌడ్

నవతెలంగాణ-చేగుంట



ఆనాడు అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని తొలగించి బహుజన రాజ్యం కోసం దండయాత్ర చేసిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ని, గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపూర్ బాలరాజ్ గౌడ్ అన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు ఈనెల 18వ తేదీన అన్ని గ్రామాలలో, పట్టణాలలో, మండల కేంద్రాలలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. జయంతి ఉత్సవాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అందరూ హాజరై ఈ వేడుకలు నిర్వహించాలన్నారు. బహుజనుల కోసం బహుజన రాజ్యం కోసం ఆనాడు మొగలులపై దండయాత్ర చేసి గోల్కొండ కోటను ఏలిన ధీరుడనీ అన్నారు. ఆ మహానుభావుడి జయంతోత్సవాలు ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించాలని కోరుకుంటున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి. కిషన్ గౌడ్ పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిస కావొద్దు



- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-మెదక్‌టౌన్

ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ బాలురుల కళాశాలలో డ్రగ్స్, గంజాయి సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్ మాట్లాడుతూ నేటి యువత అలాగే చదువుతున్నటువంటి విద్యార్థులు చిన్న వయసులోనే డ్రగ్స్, గంజాయి అనే మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాగే సోషల్ మీడియా వల్ల విద్యార్థులపై అనేక రూపాల వల్ల ప్రభావం పడుతుందని, దానివల్ల విద్యార్థులు అనేక రూపాల్లో తప్పుడు పనులకు పాల్పడుతున్నారని, ఆడపిల్లలపై అఘాయిత్యాలు చేయడం లాంటి వాటికి పాల్పడుతున్నారని, ఎక్కువగా విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుపదార్థలకు బానిసవుతున్నారని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై పడుతుందని అన్నారు. జిల్లాలో కూడా ఇలాంటి సోషల్ మీడియాను మంచి వాటికి ఉపయోగించాలని, చెడు వాటికి ఉపయోగించొద్దు అని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలియజేశారు. చుట్టూ ఉన్నటువంటి విద్యార్థులు మన అక్క, చెల్లెలు అన్నలు లాంటి వాళ్లకు కూడా ఇలాంటి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, కాలేజీ కమిటీ అధ్యక్షులు సిద్దు, సెక్రెటరీ అజయ్, విద్యార్థులు నితిన్, రాజు తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు ఏసీఎల్ ఆఫీసరును నియమించాలి

నవతెలంగాణ-టేక్మాల్



మెదక్ జిల్లాకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నియమించాలని, భవన నిర్మాణ కార్మికుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు కొండి లక్ష్మణ్ అన్నారు. మెదక్‌లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికుల ప్రమాద బీమాలో చెల్లించాల్సిన డబ్బులు విషయం ఆలస్యం అవుతుందన్నారు. లేబర్‌ల సమస్యలు ఈఎస్ఐ కార్డు సమస్య చాలా ఉన్నాయన్నారు. సరైన అధికారిని నియమించకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు.

ఈతకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని ఇసుక మడుగులో మధ్యమత్తులో ఈతకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుందిని ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన మహమ్మద్ ఇలియాస్ (30) శివారులోని ఇసుకమడుగులో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మహమ్మద్ ఇలియాస్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం ఆయన వ్యక్తిగత పనుల మీద బయటకు ఇంటి నుంచి వెళ్ళాడు. సోమవారం సాయంకాలం సమయంలో నాందేడ్ యాదగిరి, ఎండి షాదుల్, సుల్తాన్ ముగ్గురు స్నేహితులతో కలసి ఇసుక మడుగు వద్ద మద్యం సేవించారన్నారు. అనంతరం ఇసుక మడుగులో ఈత కొట్టడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడని వివరించారు. సోమవారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులు ఇసుక మడుగులో ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. మంగళవారం ఉదయం ఈతగాళ్ల సహాయంతో వెతకగా మృతదేహాన్ని బయటకు తీశారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి మహమ్మద్ హసీనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరంలో రోడ్డు సేఫ్టీ కమిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హెల్మెట్ పై ప్రజల్లో మరింత అవగహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డ్‌లు, సూచికలు, సైన్ బోర్డ్‌లు, రేడియం బోర్డ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మూల మలుపుల దగ్గర హెచ్చరికల బోర్డ్‌లు , స్పీడ్ లిమిట్ బోర్డ్‌లు, ఏర్పాటు చేసి, రోడ్డు గుంతలను పూడ్చి వేయాలన్నారు. స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేసి, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మత్తులలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక పౌరుడు తెలుసుకోవాలని, రోడ్డు భద్రత పై బాధ్యత కల్గి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. ప్రతి 3 నిమిషాలకు రోడ్డు ప్రమాదాల వల్ల ఒకరు చనిపోతున్నారని తెలిపారు. కొద్ది పాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలని అన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డు పై వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. రోడ్డు పై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రతగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలను, సూచనలను పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గల చర్యలను అదికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ,పోలీసు, ఎక్సయిజ్, జాతీయ రహదారుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న బోజనం పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పొద్దు

- మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



నవతెలంగాణ-చేగుంట

మధ్యాహ్న బోజనం పథకం స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ పేర్కొన్నారు. చేగుంట మండల మానవ వనరుల కేంద్రం కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కే. నరసమ్మ మాట్లాడుతూ తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించామన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టానికి, నష్టానికి భరించి మధ్యాహ్నం భోజనం బడి పిల్లలకు వండి పెడితే సీఎం రేవంత్‌రెడ్డి హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పేందుకు ఆలోచన చేయడం సరైనది కాదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఇట్లాంటి ఆలోచనలు వెంటనే విరమించు కోవాలన్నారు. గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనం రూ,10,వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో వంట గదులు ,మంచినీటి సౌకర్యం, వంట పాత్రలు, తదితరు కనీస సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు యూనిఫారం కేటాయించా లన్నారు .బడుగు బలహీన వర్గాలకు పౌష్టికాహారం అందాలంటే తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పిఎఫ్ ఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి వారిని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆగస్టు 21న హైదరాబాద్‌లోని విద్యా కమిషనరేట్ ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యాదమ్మ, నాయకులు గోదావరి, లక్ష్మి, నవనీత, ప్రమీల, సత్యమ్మ, సుశీలమ్మ, భారతమ్మ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బౌ బౌ మంటూ..నడిరోడ్డుపై గ్రామసింహాలు

- తూప్రాన్ మున్సిపాలిటీలో కుక్కల స్వైర విహారం



నవతెలంగాణ-తూప్రాన్

మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిపై జనసంచారం లేని రాత్రి సమయంలో గ్రామ సింహాల గుంపు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల గుంపుగా ఉన్న ప్రదేశం నుంచి ఎవరైనా వెళుతుంటే వారిపై అరుస్తూ, వాహనదారులను వెంబడించి భయపెట్టిస్తున్నాయి. పట్టణంలోని పలు వీధుల్లో, ప్రధాన రహదారుల పైన కుక్కల గుంపు నడిరోడ్డుపైకి వచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, చిన్నపిల్లలను, పెద్దలను కాటేస్తున్నాయి. ఇప్పటివరకు తూప్రాన్ పట్టణంలో పలు సందర్భాలలో కుక్క కాటుకు బలైన వారు రోడ్లపైకి రావాలంటేనే భయంతో వణికిపోతున్నారు. తూప్రాన్ మున్సిపాలిటీలో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువైపోతున్నదని మున్సిపాలిటీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ వారిచే కుక్కలను పట్టుకొని వెళ్ళుటకు ఒప్పందం చేసుకొని, కొన్ని కుక్కలను పట్టుకెళ్లారు. అయితే విడుదలవారీగా కుక్కలను పట్టుకెళ్ళడానికి బ్లూ క్రాస్ సంస్థ పనిచేస్తుంది. తూప్రాన్‌లో కుక్కల బెడద తగ్గాలంటే మున్సిపల్ అధికారులు స్పందించి విడతల వారిగా కాకుండా వీధుల్లో తిరిగే కుక్కలను పూర్తిగా పట్టుకెళ్ళడానికి చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. ఈ మధ్యన సోషల్ మీడియాలో చిన్న పిల్లలను చిన్నపిల్లలపై కుక్కలు గుంపు కుక్కల గుంపు దాడి చేసి చిన్న పిల్లలను పీక్కుతింటున్న సందర్భాలు ఎన్నో సోషల్ మీడియాలో చూస్తున్నాము. సోషల్ మీడియాలో వచ్చే చిన్నపిల్లలపై కుక్కలు దాడి చేసిన వీడియోలు చూస్తుంటే శరీరం పులకించి పోయేలా ఉన్నాయి. ఇటువంటి దుర్ఘటనలు మరెక్కడా జరగకుండా ఉండడానికి, కుక్కల బెడద లేకుండా, బ్లూ క్రాస్ సంస్థ వాళ్ళు కుక్కలను తొందరగా పట్టుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మత్తు పదార్థాల రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను అదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని విడియో సమావేశ మందిరంలో మంగళవారం మత్తు పదార్థాల రవాణా ను అరికట్టాలని జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణా పై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల, యువత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేస్తున్న వారినీ పసిగట్టలని, పాఠశాలలు, కలశాలలు, కిరాణ, మెడికల్ షాపుల పై నిఘా పెంచాలని, పాను షాపులను పరిశీలించాలని, కిరణా షాపులలో అమ్మే చాక్లెట్స్, ఇతర తిను బండారాలను పరిశీలించాలని, పారిశ్రామిక ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలని, మెడికల్ షాపులా దగ్గర సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవన్నారు. యువత తెలిసి తెలియక మత్తుకు బానిసై బంగారం లాంటి భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దు అన్నారు. యువత డ్రగ్స్, కొకైన్, గంజాయి లాంటి మత్తు పదార్థాల వల్ల చాలా అనర్థాలు కలుగుతాయన్నారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కోల్పోతున్నరాని, తల్లి తండ్రుల కూడా పిల్లల ప్రవర్తనను తెలుసుకోవాలి అని, పిల్లల ప్రవర్తనలో మార్పు అనిపిస్తే పోలీస్ శాఖ వారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఈఓ రాధా కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, ఎక్సైజ్ అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

నవతెలంగాణ-చేగుంట



జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలు దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చేగుంట పోలీస్ స్టేషన్లో మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేటకు చెందిన మోతి జనార్ధన్ (21) ఈనెల 13వ తేదీన తెల్లవారుజామున సుమారు మూడున్నర సమయంలో చేగుంట ఎస్సై బాలరాజ్ తన సిబ్బందితో కలిసి మాసాయిపేట గ్రామ శివారులోని షేరి పంజాబీ దాబా సమీపంలో 44వ జాతీయ రహదారి పై వాహనాలు తనిఖీ చేస్తుండగా మోతి జనార్ధన్ తన స్ప్లెండర్ ప్లస్ బైక్ టీయస్15ఈ బీఓ298 గల దానిపై చేగుంట వైపు వెళుతుండగా అతని బైకు ఆపడంతో మోటార్ సైకిల్ వదిలి పారిపోవుటకు ప్రయత్నించగా సిబ్బందితో కలిసి పట్టుకుని విచారించగా తను జల్సాలకు అలవాటుపడి ఈజీగా డబ్బు సంపాదించడం బైకులతోనే సాధ్యం అవుతుందని ఈ మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇతను చోరీ చేసే ఏరియాలో చేగుంట, రామయంపేట్, తూప్రాన్, మెదక్‌టౌన్, నిజాంపేట్, మేడ్చల్, హైదరాబాద్, ఏరియాలలో ఇండ్ల ముందు పార్కు చేసిన, రైల్వే స్టేషన్‌ల ముందు పార్క్ చేసిన బైకులను దొంగతనం చేసి డబ్బులకు విక్రయించేవాడు జనార్ధన్ ఇంటి సమీపంలో ఉన్న చెట్లపొదలల్లో దాచిన 15 బైకులను స్వాధీనం చేసుకున్నామని, సుమారు అంచనా రూ.5 లక్షల వరకు ఉంటుందని, ఇతన్ని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, చేగుంట ఎస్సై బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ సత్యం, సిబ్బంది వెంకటేశం, బాలరాజులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరించిన కార్యదర్శి

నవతెలంగాణ-నార్సింగి



రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా, మండల కేంద్రంలో పిచ్చి మొక్కలు, గడ్డిని, మురుగు నీరు సమస్యను గ్రామ కార్యదర్శి తొలగించారు. మురుగు నీరు, వర్షపు నీరు నిలువ ఉన్న చోట్ల ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, తదితర చర్యలతో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇంత చేసినా కొందరి అనాలోచిత చర్యల వల్ల స్వచ్ఛదనం కోసం చేసిన కష్టం, ఖర్చు వృధా అవుతుంది. పట్టణ కేంద్రంలోని బీసీ కాలనిలో గతంలో సీసీ రోడ్డు వేశారు. ఆ సమయంలో రోడ్డుకు ఇటు వైపు ఉన్న మురుగు కాలువలో రోడ్డుకు అటు వైపు ఇండ్లు ఉన్నవారు తమ ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు పోవడం కోసం పైపులు వేసుకున్నారు. కానీ, రెండు ఇళ్ల వారు మాత్రం అప్పట్లో ఎందుకో ఏమో మురుగు నీటి కొరకు పైపులు వేసుకోకుండా తమ ఇంటి నీరు రోడ్డు పై వదులుతూ, పరిసరాలను మురుగు మయం, బురదమయం చేస్తున్నారు. గతంలో ఈ విషయంపై బీసీ కాలని వారు వారితో పైపులు వేసుకోవాలని పలు మార్లు చెప్పినా వారు దాట వేస్తూ వచ్చారు. గతంలో వారికి పంచాయతీ కార్యాలయం నుంచి ఈ విషయమై నోటీసులు కూడా జారీ చేసారు, అయినా వారు స్పందించలేదు. ఇటీవల స్వచ్ఛదనంలో భాగంగా అక్కడ నిలువ ఉన్న నీటిలో పంచాయతీ కార్మికులు ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వేశారు. రోజూ మురుగు నీరు చేరుతుండడంతో దోమలు ప్రబలి రోడ్డు పై మురుగు నీటిలో నుంచి దుర్వాసన, దోమలు రావడం మొదలయ్యాయని, దానివల్ల సోమవారం బీసీ కాలానికి చెందిన ఒక మహిళకు వైరల్ జ్వరం రావడంతో ఆమె ఆసుపత్రి పాలైందని, తమ సమస్యను వెంటనే తీర్చాలని మంగళవారం నార్సింగి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగభూషణంకు బీసీ కాలని వాసులు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన కార్యదర్శి వెంటనే పంచాయితీ సిబ్బందిని పంపించి నిలువ ఉన్న మురుగు నీటిని ఖాళీ చేయించి, బ్లీచింగ్ పౌడర్ వేశారు. రోడ్డుపై మురుగు నీరు చేర్చుతున్న వాళ్ళతో మాట్లాడి వారితో వెంటనే పైపులను వేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ స్వచ్ఛదనం విషయంలో ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని, స్వచ్ఛత కోసం అందరూ సహకరించాలని, ఇతరులకు ఎలాంటి ఇబ్బందులూ కలిపించవద్దన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

క్షేత్ర స్థాయి పర్యటన చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

నవతెలంగాణ-నార్సింగి



జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ మండల పరిధిలోని నర్సంపల్లిలో క్షేత్ర స్థాయి పర్యటన చేస్తూ పండ్ల తోటలను, మక్కజొన్న చేనులు, వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోవింద్ రైతులకు పలు సూచనలు చేశారు. పండ్ల తోటలో పెసర, మినుము అంతర పంటగా వేసుకోవాలని, తద్వారా కలుపు సమస్యను నివారించ వచ్చని, భూమి సారవంతమవుతుందని, రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. మక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశిస్తున్నందువల్ల, వాటి నివారణ కొరకు ఇమామెక్టిన్ బెంజాయిడ్ 5 ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు. వరిలో ప్రస్తుతానికి ఎలాంటి చీడ పురుగులు లేవని తెలిపారు. మొక్కజొన్న, వరి పంటను వ్యవసాయ అధికారుల వద్ద న ఎ ా హ ద ు ం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారిని విజ్ఞంభణ, రైతులు పాల్గొన్నారు.

బాలాజీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- నాలుగున్నర కేజీల కణతి తొలగింపు

నవతెలంగాణ-రామాయంపేట్



అరుదైన శస్త్ర చికిత్స చేసి డాక్టర్ హేమరాజ్ సింగ్ నేతృత్వంలోని టీం ఏడున్నర కేజీల కణతిని తొలగించారు. బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఎల్లవ్వ అనే మహిళ గత కొన్ని నెలల నుంచి కడుపులో కణతితో బాధపడుతుంది. రామాయంపేట పట్టణంలోని బాలాజీ హాస్పిటల్‌లో సర్జన్ డాక్టర్ హేమరాజ్ సింగ్, అనస్తీషియన్ డాక్టర్ రాఘవేంద్ర నేతృత్వంలో శనివారం శస్త్ర చికిత్స నిర్వహించి నాలుగున్నర కేజీల కణతి తొలగించారు. తొలగించిన కణతినీ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ఆపరేషన్ సక్సెస్ అవ్వడం పట్ల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రామరాజు, ఎల్లవ్వ భర్త వెంకటిలు ఆనందం వ్యక్తం చేశారు.

కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి, కామన్ విద్యా విధానాన్ని అమలు చేసే రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు విజయవంతంగా మంగళవారం ముగిశాయి. అనంతరం నూతన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా బోడ.అనిల్, మన్నే కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల అనంతరం భవిష్యత్తు ఉద్యమ కార్యాచారణను రూపొందించుకోన్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్లో సర్వేలు, అదే విధంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పునర్ నిర్మించాలని పెద్ద యెత్తున పోరాటానికి రూపకల్పన చేసుకున్నారని అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేసి, సంక్షేమ హాస్టళ్లకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి వెంటనే అమలు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వానికి ఈ శిక్షణా తరగతుల నుంచి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, నగేష్, రవి, శేఖర్, నాగరాణి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, తృణధాన్యాల పంటలలో సస్యరక్షణ చర్యలు అవసరం



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

మండలం పరిధిలోని మండలంలోని తీగుల్ గ్రామంలో గల రైతు వేదిక యందు రైతు సోదరులకు మొక్కజొన్న, తృణధాన్యాల పంటలలో చీడపీడల యాజమాన్యం, వివిధ పంటలలో పురుగుమందు అవశేషాలు అనే అంశం మీద హైదరాబాదు నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ భద్రు, డాక్టర్ శ్రీదేవిల శ్రవణ దృశ్యం మాధ్యమం ద్వారా రైతు సోదరులకు మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, సమత, ఖలీల్, భాను, కిరణ్, కృష్ణమూర్తి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. మంగళవారం ప్రజ్ఞాపూర్ పాఠశాలలో వీరందరికీ ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పూర్వపు ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటమ్మ, ప్రేమలత, బాలస్వామి అందరూ విద్యార్థులను ఎంతో చక్కగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అదే ప్రోత్సాహంతో మేము విద్యార్థులను తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారువాణి, శారద, నరేష్, ఆత్మీయతతో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వీడ్కోలు సమావేశంలో విద్యార్థులందరికీ స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను, పెన్నులు, పెన్సిల్లు, చాక్లెట్లు బిస్కెట్లను పూర్వపు ఉపాధ్యాయులు మదనాల శ్రీనివాస్, వెంకటమ్మ, ప్రేమలత, బాలస్వామి విద్యార్థులకు అభినందించారు.

కేసీఆర్ ఆలోచన అద్భుతం



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ సీఎం కేసీఆర్ ఆలోచన తోనే సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ అద్భుతంగా పనిచేస్తుందని సిద్దిపేట జిల్లా బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగరావు అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణం చెందిన పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల ఆరోగ్య సంరక్షణకు కొంత సాయం కోసం ఈ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. గత పదేళ్లుగా ఎంతోమంది పేదలకు సీఎం సహాయ నిధి పలువురు పేదలకు వరంగా మారిందన్నారు. పేదలను దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. కేసీఆర్ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్, కేసీఆర్ కిట్టు తోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదని అన్నారు. రైతు బీమా, రైతు బంధు తదితర పథకాలను అమలు చేయాలని కోరారు. ఇందులో భాగంగా గజ్వేల్ పట్టణానికి చెందిన కళ్యాణ్కర్ రజితకు రూ.60వేలు, అనితకు రూ.15వేలు, లింగం గారి విజయనిర్మలకు రూ.28,500 వేలు, రాజిరెడ్డి రూ.45వేలు, మౌనికకు రూ.23 వేల అందించినట్లు చెప్పారు.

బ్రెన్ ట్యూమర్ వ్యాధిగ్రస్తుడికి ఎల్ఓసీ అందజేత

- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

అర్బన్ మండలంలోని బక్రీచెప్యాల గ్రామనికి చెందిన కొత్తపల్లి యాదగిరి కుమారుడు వరప్రసాద్‌కు బ్రెన్ ట్యూమర్ వ్యాధి ఉన్నందున, ఆపరేషన్ కోసం రెండు లక్షల ఎల్వోసీని అందించినట్లు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబం ఆపరేషన్ చేయించుకోలేని స్థితిలో ఉందని, తన సహాయం కోరగా తక్షణమే ఇన్చార్జి మినిస్టర్ కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.2 లక్షలు ఎల్ఓసీని అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు అనిల్ యాదవ్, షాబుద్దీన్, వనజ, మాడుగుల రాములు, పిండి అనిల్ కుమార్, వెలికట్ట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను తీవ్రంగా ఖండించిన రామకోటి



నవతెలంగాణ-గజ్వేల్

బాంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో పాల్గొన్న శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రపంచంలో హిందువులకు రక్షణ కరువైందన్నారు. హిందువులకు అన్ని విధాల రక్షణ కల్పించాలని డిమాడ్ చేశారు. హైదవ సోదరులు యెలగందుల రాంచంద్రం, పనిధర్‌శర్మ, దూబకుంట ప్రభాకర్, గంగిశెట్టి ఉమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనఖీ గ్రామ సభలు



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి, ఇప్పలగూడెం గ్రామాలలో ప్రత్యేకాధికారి, తహాసీల్దారు ఆరిఫా అధ్యక్షతన సామాజిక తనఖీలో భాగంగా గ్రామ సభను నిర్వహించారు. మంగళవారం గ్రామ సభలో ఉపాది హామీలో చేసిన పనులను సామాజిక తనఖీ భాద్యులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపాది హామీ టీఏలు సురేష్, నరేష్, పంచాయతీ కార్యదర్శులు సిద్దేశ్వర్, రాజశేఖర్ రెడ్డి, నిలీమా, ఫీల్డ్ అసిస్టెంట్‌లు లలిత, ఆశోక్, సుధాకర్ రెడ్డి, ఉపాది హామీ కూలీలు, గ్రామస్థులు, తదితరులున్నారు.

ముట్రాజ్‌పల్లిలో డ్రై డే



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డ్ సంగాపూర్ గ్రామంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీగిరిపల్లి ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లిలో ఫీవర్ కేసులను 20 మందికి గుర్తించారు. గ్రామంలో మురికి కాలువల వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. ఈ ప్రాబ్లం గురించి మున్సిపల్ చైర్మెన్ గతంలో ఉన్న కమిషనర్ ఎన్నోసార్లు గుర్తు చేసినట్లు స్థానిక కౌన్సిలర్ శ్యామల మల్లేశం తెలిపారు. మురికి నీటి గుంటలలో డెమో పాస్ మందును పిచికారి చేశారన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్ స్థానిక కౌన్సిలర్ సీర్ల శ్యామల, మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ వార్డు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లేదంటే కలరా, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గునియా, డెంగ్యూ, సోకే ప్రమాదం ఉంది. లేదంటే ప్రాణానికి ముప్పు అని వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. భాగ్యశ్రీ, స్థానిక ఏఎన్ఎం దీన సిస్టర్ గజ్వేల్ డివిజన్ ఎపెడమిక్ సెల్ సభ్యులు దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు ఆశ వర్కర్ జుబేదాబేగం ఫీల్డ్ వర్కర్ వాజిత్, అల్తాఫ్, రమేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ లక్ష్యం



- మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శశికళ రేగొండ

నవతెలంగాణ-గజ్వేల్

రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నక్క శశికళ రేగొండ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన రైతు రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. గత 60 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చిన రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సొంత ప్రయోజనాల కోసం పనిచేసినట్లు విమర్శించారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ రైతులకు చేయాలంటే రూ.లక్ష ఐదు ఏళ్లు చేశారని ఇది కూడా కొందరి రైతులకు దరిదాపులోకి రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తా అనే హామీ ఇచ్చి ఆగస్టు 30 తారీఖు లోపు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తానని ప్రకటించి రెండో విడత రుణమాఫీ పూర్తి చేసినట్లు అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతుంది అన్నారు. ఆగస్టు నెలలో మిగతా గ్యారెంటీలు అమలు కసరత్తు చేస్తుందని గత ప్రభుత్వంలో సైతం అనేకసార్లు పెన్షన్ దారులకు సకాలంలో వెయ్యలేక పోయినట్లు తెలిపారు. రానున్న కాలంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మరిన్ని శుభవార్తలు చెప్తారని పేర్కొన్నారు.

త్రిబుల్ ఆర్ హైవే అథారిటీ కేంద్రంగా గజ్వేల్



నవతెలంగాణ-గజ్వేల్

త్రిబుల్ ఆర్ రోడ్డుకు సంబంధించిన అథారిటీ విభాగాన్ని గజ్వేల్ కేంద్రంగా కార్యకలాపాలను కొనసాగించాలని నిర్ణయించి కొనసాగిస్తున్నారు. గజ్వేల్ ప్రాంతంలోని ఎక్కువ 980 ఎకరాల భూమి సేకరిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గజ్వేల్ కేంద్రంగా పనులు కొనసాగించాలని నిర్ణయించారు. ట్రిబుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) ఉత్తర భాగం భూసేకరణ సింహభాగం కొలిక్కివస్తున్నది. 4,750 ఎకరాల సేకరణ లక్ష్యానికి గానూ ఇప్పటికే 3,675 ఎకరాలను సేకరించేందుకు కసరత్తు పూర్తి చేశారు. ట్రబుల్ ఆర్ పనులను పర్యవే క్షిస్తున్న ఎస్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) కార్యకలాపాలు గజ్వేల్ కేంద్రంగా సాగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ట్రిబుల్ ఆర్ భూసేకరణ పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నారు. ఇందుకోసం రెవెన్యూ డివిజన్ల వారీగా కాలా (కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ ఆక్విజేషన్) లను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఉత్తర భాగం పరిధిలో ఎనిమిది కాలాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గజ్వేల్ కాలా పరిధిలో 32 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇక్కడ 17 గ్రామాలలో తూప్రాన్ మండల పరిధిలోని 14 కిలోమీటర్ల రోడ్డు కోసం 8 గ్రామాల్లో, నర్సాపూర్ లో 28 కిలోమీటర్ల కోసం 14 గ్రామాల్లో భూసేకరణ జరగనున్నది. భువనగిరి కాలా పరిధిలో 15 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో జరగనుండగా 6 గ్రామాల్లో భూమిని సేకరించనున్నారు. అదేవిధంగా చౌటుప్పల్ యాదాద్రి అందోల్, జోగిపేట, సంగారెడ్డి కాలాలు ఉన్నాయి. మొత్తంగా 8 కాలాల పరిధిలో 84 గ్రామాల్లో 4,750 ఎకరాల వరకు భూసేకరణ జరగనున్నది. అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఉత్తర భాగంగా ఒరిజినల్ రింగ్ రోడ్డు నిడివి 158 లో మీటర్ల కాగా ఇందులో 110 కిలోమీటర్ల పైగా ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనున్నది. ఆయా కాలాలను సంబంధించి త్రీడీ, త్రీజీ నోటిఫికేషన్లు పూర్తయిన సంగతి కూడా తెలిసిందే. అంతేకాకుండా రైతులతో సందేశాలు పూర్తిచేసి 3,675 ఎకరాలను భూసేకరణకు సిద్ధం చేశారు.

మేము సగం.. మీరు సగం

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో సగం విభజించుకుంటున్నాయి. ప్రస్తుతం సింహ భాగం భూసేకరణ ప్రక్రియ తుది దశకు వస్తుండగా ఇలా కొలిక్కి వచ్చిన భూసేకరణ పరిహారం చెల్లింపు విషయము కూడా ముందు సాగనున్నది. నల్లగొండ జిల్లాలోని రాయగిరి వద్ద కొన్ని కారణాలవల్ల భూసేకరణ పెండింగ్లో ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధించిన ఒప్పందం పూర్తి కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. దీనుగాను త్రిబుల్ ఆర్ ఉత్తర భాగం పనులను పర్యవేక్షిస్తున్న ఎన్‌హెచ్ఏఐ అథారిటీ కార్యకలాపాలను గజ్వేల్ కేంద్రంగా ముందుకు సాగనున్నాయి.

మధ్యాహ్న భోజన పథకాన్నిప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వొద్దు

- హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్కు ఇచ్చే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి
- మధ్యాహ్న భోజన పథక కార్మికులు, సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి ఇచ్చే ప్రతిపాదన వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట అర్బన్, రూరల్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి డీఈఓకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ 2024 జూన్ 27న రాష్ట్ర ముఖ్యమంత్రి హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమై సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే కొడంగల్‌లో సెమి రెసిడెన్షియల్ పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనాయని రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించారని ఇది సరైనది కాదని అన్నారు. ఈ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులు గత 24 ఏళ్లగా అనేక కష్టా, నష్టాలకు ఓర్చి పనిచేస్తున్నారు. పనిచేసే వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మహిళలు వీరి ఉపాధిని పరిగణలోకి తీసుకోకుండా మొత్తం పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్కి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉంది. కార్మికులకు సకాలంలో బిల్లులు రాకపోయినా అప్పులు చేసి పిల్లలకి వండి పెట్టి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా ప్రభుత్వం ఏదో ఒక రోజు ఆలోచిస్తది అనేటటువంటి నమ్మకంతో కార్మికులంతా పనిచేస్తున్నారు. ఒక పక్క ఆకాశాన్ని అంటుతున్న ధరలు, మరోపక్క పిల్లలకి ఇచ్చే మెనూ చార్జీలు కార్మికులకు ఇచ్చే వేతనం నెలల తరబడి పెండింగ్లో ఉంది. అయినా ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త స్కీము ప్రభుత్వం మా గురించి ఆలోచిస్తాది అనేటటువంటి విశ్వాసంతో కార్మికులందరూ ఉన్నారు. మూలికే నక్కపై తాటిపండు పడ్డట్లుగా కార్మికులకు అన్యాయం చేస్తు కేంద్రీకృత వంటశాలలు తీసుకొచ్చి కార్మికుల పొట్టలు కొట్టేటటువంటి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైనా ఈ ఆలోచన విరమించకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మామిడాల కనకయ్య యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెల్లి రాజమణి, కార్మికులు కిష్టవ కిష్టవ్వ, లింగవ్వ, స్వప్న, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నెముకగా పీఏసీఎస్ సేవలు

- కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు
- పీఏసీఎస్ భవనాన్ని సందర్శించిన అయా రాష్ట్రాల బ్యాంక్ అధికారులు
- పీఏసీఎస్ సేవలు, లావాదేవిలపై సమీక్షా



నవతెలంగాణ-బెజ్జంకి

సహకార సంఘాల్లో పీఏసీఎస్ సేవలు చిన్న, సన్నకారు రైతులకు వెన్నెముకగా నిలుస్తున్నాయని కరీంనగర్ డీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని నూతన పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని మిజోరం, మేఘాలయ, జమ్ము కాశ్మీర్, అస్సాం, బీహార్, ఉత్తరాఖండ్, హిమచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల 19 మంది బ్యాంక్ అధికారులు సందర్శించారు. భవన అవరణంలో నిర్మించిన నూతన ఏసీ పంక్షన్ హాల్, లాకర్ సౌకర్యం, దుకాణాల సముదాయం, సీఎస్సీ సేవలను పరిశీలించారు. అనంతరం పీఏసీఎస్ సమావేశ మందిరంలో పీఏసీఎస్ చైర్మెన్ తన్నీరు శరత్ రావు, పాలకవర్గం సభ్యులు, కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగులతో అయా రాష్ట్రాల సహకార సంఘాల బ్యాంక్ అధికారులు రైతులకు అందిస్తున్న సేవలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మంజూరీ, రుణాల వసూళ్లలో వ్యవహరించే తీరు, లావాదేవిలపై పీఏసీఎస్ రీసోర్స్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ వివరించారు. సీఈఓ శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, సూపర్ వైజర్ దుర్గం, పాలక వర్గం సభ్యులు, పీఏసీఎస్ సిబ్బంది బుచ్చయ్య, భాను ప్రకాశ్, అనిల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. పీఏసీఎస్ కార్యాలయ భవనం బేష్..

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయ భవన నిర్మాణాన్ని అయా రాష్ట్రాల సహకార సంఘాల బ్యాంక్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఏసీ పంక్షన్ హాల్, పీఏసీఎస్ భవనాన్ని సందర్శించి నిర్మాణం బేషంటూ ఆనందం వ్యక్తం చేశారు. అద్దె ప్రాతిపదికన వాణిజ్య దుకాణాల నిర్మాణం చేపట్టడం ఆదాయ రాబడికి మార్గమని సంతోషం వ్యక్తం చేశారు.

దంత రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వ దంత వైద్యులు

- తెలంగాణ రాష్ట్ర దంత వైద్యుల సంఘం అధ్యక్షులు డీఎన్ స్వామి



నవతెలంగాణ-సిద్దిపేట

దంత సమస్యలపై మెడికల్ కళాశాలకు వచ్చే రోగులకు ఇక్కడ పనిచేస్తున్న దంత వైద్యులు అందుబాటులో ఉండక, సేవలందించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర దంత వైద్యుల సంఘం అధ్యక్షులు డీఎన్ స్వామి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్దతిలో ఒకరు, రెగ్యులర్‌గా ఒకరు దంత వైద్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యం ఉంటుందని, వారికి దంత సమస్యలు వచ్చినప్పుడు ఓపీ చిట్టి కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, కానీ వారు వచ్చినప్పుడు ఇక్కడ వైద్యులు లేకపోవడం, వీరు రెగ్యులర్‌గా రాకపోవడంతో ఉపాధ్యాయులు పలుమార్లు లీవులు పెట్టుకొని తిరగాల్సి వస్తుందని, ఇబ్బందులు పడుతున్నామని, వారి సమస్యలు మా దృష్టికి తీసుకురాగా వివరాలు సేకరించామని తెలిపారు. ఇక్కడ పనిచేసే ఇద్దరు దంత వైద్యుల మధ్య మనస్పర్థలు మూలంగా రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రెగ్యులర్ గా ఉండకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని, కమిషన్ల కోసం ఇక్కడికి వచ్చిన రోగులను తమకు అనుకూలంగా ఉన్న ఆసుపత్రులకు పంపిస్తున్నారని, దీనిని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ దంత వైద్యులు పాల్గొన్నారు.

పోలీసు కళాబృందంచే ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు



నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమవారం రాత్రి వంటిమామిడి గ్రామంలో పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు నిర్వహించారు. ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఏం చేస్తున్నారు, ఎవరెవరితో తిరుగుతున్నారు, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా, ఇంటికి ఏమైనా ఆన్లైన్ ద్వారా పార్సల్స్ వస్తున్నాయా ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ప్రవర్తనలో ఏవైనా మార్పులు ఉంటే ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని తెలిపారు. యువతి యువకులను గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అట్టి వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులమని రుణమాఫీ వస్తుందని కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్డేట్ చేయాలని, విదేశాలలో మీ పిల్లలు ఉంటే వారి పేరు చెప్పి అక్కడ నేరం చేశారని చెప్పి మోసం కాల్ చేస్తారు. జాగ్రత్త మీకు తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్ కళా బృందం కనువిప్పు అనే కార్యక్రమం ద్వారా మూఢనమ్మకాల పై, మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు గురించి, పేకాట ఆడుట వలన కుటుంబలో జరుగుతున్న పరిణామాలను, వరకట్నం వలన జరుగుతున్న సంఘటనలు గురించి, ఈ మధ్య జరుగుతున్న ఆత్మహత్యలు గురించి, వృద్ధులైన తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలి, డ్రైవింగ్ లైసెన్స్, షీ టీమ్స్ జరుగుతున్న సైబర్ నేరాల గురించి పాటల ద్వారా, సీడీల ద్వారా కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, బిక్షపతి పాటల రూపంలో, నాటకం రూపంలో ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడ్డ ముదిరాజులను బీసీఏలో చేర్చాలి

- ముదిరాజ్ సంఘం నేతల డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేట

ముదిరాజులు ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాలలో వెనుకబడి ఉన్నారని అనంతరామన్ కమిషన్ గతంలోని చెప్పిందని, కమిషన్ సూచనల మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీడీ కేటగిరీ నుంచి బీసీఏ కేటగిరీలోకి మార్చాలని సిద్దిపేట ముదిరాజ్ సంఘం నాయకులు జంగిటి శ్రీనివాస్, యామ ధర్మ, మిట్టపల్లి శ్రీనివాస్, మిద్దె రవిలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీఏ కేటగిరీలోని కొన్ని కులాలు తమను బీసీఏ కేటగిరీలోకి చేరనీయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జీవో 15 ద్వారా ముదిరాజ్ లను బీసీఏ లో చేర్చారని, తర్వాత కోర్ట్ కేసుల వలన అది సాధ్యపడలేదని వాపోయారు. ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని సుప్రీంకోర్టు సూచించిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చాలా వెనుకబడి ఉన్నామని, తమకు రావాల్సిన రిజర్వేషన్లు తమకు అందట్లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముదిరాజ్ లను బీసీఏ లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు బైరి యాదగిరి, సతీష్, కిష్టాపూర్ లక్ష్మణ్, కొంతం శ్రావణ్, గుమ్మడి శ్రీశైలం, రాజేష్ శేఖర్ పాల్గొన్నారు.

రుణమాఫీ పేరిట ఇతర పథకాలు ఎగవేత

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రైతు రుణమాఫీ పేరిట ఇతర పథకాలను సీఎం రేవంత్ రెడ్డి మంగళం పాడనున్నట్లు ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటే ప్రతాపరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి పెన్షన్ పెంచాలని మహిళలు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 నెలలుగా రైతు రుణమాఫీ చుట్టు సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 6 గ్యారంటీలు పేరిట వాటి కింద 420 హామీల వరకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పట్ల విశ్వాసం లేదని అన్నారు. ఇప్పటికి పెన్షన్ పెంచలేదని, మహిళలకు.రూ 2500 వరకు డబ్బులు ఏమైనాట్లు అని ప్రశ్నించారు. మిడిమిడి జ్ఞానంతో కాంగ్రెస్ మంత్రులు మాట్లాడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు.రూ 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. రైతుబంధు పథకాన్ని ఎగనామం పెట్టే అవకాశం ఉందని విమర్శించారు. రైతు భరోసా లేదని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్థులకు ఫ్రీ ఇంటర్మీడియట్ వైఫై సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. చదువుకుంటున్న ప్రతి నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేల ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గదాల ఇంటి స్థలం ఇచ్చి రూ.ఐదు లక్షల ఇస్తామని చెప్పి చేతులు దులుపుకున్నట్లు విమర్శించారు. యువ వికాసం ద్వారా విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డులు కాంగ్రెస్ పార్టీ ఇవ్వకపోతుందన్నారు.

అప్రమత్తతోనే విష జ్వరాల అదుపు

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



నవతెలంగాణ-బెజ్జంకి

డెంగ్యూ,టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలడం పరిపాటైన అందుకు భిన్నంగా డెంగ్యూ టైఫాయిడ్ జ్వరాలు కూడా సోకుతున్నాయని జ్వరాల బారినపడిన ప్రజలు జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతుంటారని ఆయన తెలిపారు. డెంగ్యూతో పాటు వైరల్ ఫీవర్ లక్షణాలు కూడా ఒకేలా ఉండడంతో సాధారణ జ్వరం ప్రజల్లో తీవ్ర అందోళన చెందుతారని డెంగ్యూ జ్వరం సోకినా సాధారణ జ్వరమేనని నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన వైద్యులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. డెంగ్యూ జ్వరాల కారణంగా చాలా మందిలో ప్లేట్లెట్లు పడిపోయే అవకాశముందన్నారు. లక్షణాలను గుర్తించి వెంటనే ఆస్పత్రులను ఆశ్రయించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విష జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిట్ వంటి జ్వరాల అదుపుకు యుద్ధప్రాతిపదికన పటిష్టమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేస్తుందని తెలిపారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని, బయట దొరికే తినుబండారాలు, ఆహార పదార్థాల జోలికి వెళ్లకుండా ఇంటి ఆహారమే తీసుకుంటూ ఎప్పటికప్పుడు వేడి ఆహారాన్ని భుజిస్తూ, కాచి వడబోసి చల్లార్చిన మంచినీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ లాంటి ద్రవాలు తీసుకుంటే మంచిదని ఆయన సూచించారు. బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని తెలిపారు.

ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏఎస్‌పీ మదన్ మోహన్



నవతెలంగాణ-మద్దూరు

గ్రామీణ ప్రాంత ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌పీ మదన్ మోహన్ కోరారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో పోస్ట్ ఆఫీస్ నందు డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పీ మదన్ మోహన్, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ జనగామ బ్యాంక్ మేనేజర్ రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ తపాలా శాఖ ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని పలు రకాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రికరింగ్ డిపాజిట్ ,సేవింగ్స్ బ్యాంక్, సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాల జీవిత భీమా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, అలాగే ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకులో రూ.555 లకు 10 లక్షల ప్రమాద బీమా, రూ.749 లకు 15 లక్షల ప్రమాద బీమా, పథకాలు ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, జనగామ ఎంటలు బిక్షపతి, మల్లారెడ్డి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ప్రవళిక, నర్సింహులు, సిద్దేశ్వర్లు, పరశు రాంరెడ్డి, రాజు, తిమ్మయ్య భార్గవి, ఉషరాణి తపాలా సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది

- సీఐటీయు జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి



నవతెలంగాణ-మిరుదొడ్డి

మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయు జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసిల్దార్ కార్యాలయంలో వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పగించాలని చూడడం సరైనది కాదన్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పగించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అదే తరహాలో విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించాలని చూడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్ల వినతి పత్రాన్ని తహసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు అంజయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పలువురు పాల్గొన్నారు.

మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- రైతు వేదిక వద్ద గ్రామస్తులకు అవగాహన
- ఎస్సై అపూర్వ రెడ్డి




నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

స్పందన

మందు బాబులకు నిలయంగా రైతు వేదిక ఆదివారం నవతెలంగాణలో వెలువడిన వార్త శీర్షికకు సోమవారం ఎస్సై అపూర్వ రెడ్డి పోలీస్ సిబ్బందితో వెంకటాపూర్ గ్రామ రైతు వేదికను సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని సూచించారు. గ్రామంలో కిరాణం హెూటల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. గ్రామంలో ఏదైనా సమస్యతాలేత్తుతే వెంటనే పోలీస్ శాఖకు తెలియజేయాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది



నవతెలంగాణ-నంగునూరు

ఉపాధ్యాయ వృత్తిలో బదిలీలు సహజమేనని విద్యార్థుల మనసులను చూరగొన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మర్చిపోరని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి పేర్కొన్నారు. నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని ఏళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి గత నెలలో జరిగిన బదిలీలలో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడుకోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నర్మెట ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని ఏళ్లుగా పనిచేసి విద్యార్థులకు చక్కటి శ్రద్ధతో విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ఉపాధ్యాయులు భోజు సీతారాములు, కల్లాటి శ్రీనివాస్, గడీల శ్రీకాంత్, శారదలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల నర్మెటలో పనిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీ కాపాడిన ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులకు రాగి జావా తాగడానికి వీలుగా స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ రజిత, పాఠశాల ఉపాధ్యాయ బృందం తహసీల్ సుల్తానా, అర్షద్, యాదగిరి, సునీత, లలిత, విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ యువకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యేకు వినతి




నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని మంగళవారం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని జనగామ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ మట్టి రోడ్డు వల్ల వర్షాకాలంలో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహన దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉందని అన్నారు. బీటీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే కొమురవెల్లి మండలంలోని తపసుపల్లి రిజర్వాయర్ ద్వారా మాధవరెడ్డి, బయన్న చెరువులోకి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్ రెడ్డి, ఘర్షపల్లి చంద్రం, ఆరెపల్లి లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, ఉన్నారు.

ఎఫ్‌పీఓ కేంద్రాలలో రైతుల సభ్యత్వాలను పెంచాలి


- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని ఎఫ్‌పిఓ కేంద్రాలలో రైతుల సభ్యత్వాల సంఖ్య పెంచాలని సిఈఓ, డైరెక్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ సెక్టార్ స్కీం ఫర్ ఫార్మేషన్ అండ్ ప్రమోషన్ ఆఫ్ 10,000 ఎఫ్‌పిఓలలో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఈ సీఎస్ఎస్ స్కీం వల్ల 11 మండల క్లస్టర్లలో ఏర్పడిన 11 ఎఫ్‌పిఓలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎంపిక చేసుకుని రైతులు ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన వన శాఖలో కూరగాయల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ పంప్ ప్లాంటేషన్‌కు సంబంధించి రైతులను మేలు చేసే యూనిట్లను చెప్పి ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డు డిడిఎం నిఖిల్, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య, ఎల్డిఎం హరిబాబు, డిఏఓ మహేష్, డిహెచ్ఎస్ఓ సువర్ణ తదితరులు పాల్గొన్నారు

పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వం అందించిన పట్టా సర్టిఫికెట్లకు పాసుబుక్కులు ఇవ్వాలని కొండపాక మండలంలోని బాధితులు (పట్టాదారులు) మంగళవారం రోజున తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయంలో కొండపాక మండల కేంద్రంలో ఉన్న సర్వే నంబర్లు 182, 184, 185, 186, 190, 191, 192, 193లలో గల సీలింగ్ భూమిలో ఎస్సీ, బీసీ, ఎస్టీ కులాలకు చెందిన కొంతమంది గ్రామస్తులకు ప్రభుత్వం పట్టాదారు సర్టిఫికెట్లు అందజేశారు. దాదాపు 60 ఏళ్ల నుంచి కబ్జాలో ఉండగా రెవెన్యూ రికార్డులలో మా పేర్లు నమోదు చేయలేదని, ఇప్పుడు అక్రమంగా అధికార పార్టీకి చెందిన కొందరి అండదండలతో కొంత మంది అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకొని మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తూ మీరు కాలిచేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట కలెక్టర్‌కి కూడా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యకంలో మొటం, సత్తయ్య, మోటం అంకూస్, సొప్పరి గణేష్, సొప్పరి రమేష్, చుండు బిక్షపతిలు పాల్గొన్నారు.


కోర్టు తీర్పులో మోడీ, మందకృష్ణలకు సంబంధం లేదు

నవతెలంగాణ-నంగునూరు

ఎస్సీ వర్గీకరణ కోర్టు తీర్పుతో మందకృష్ణ మాదిగకు బీజేపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ అన్నారు.మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవులపల్లి రాజేందర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటంలో ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారన్నారు. అమరుల పేరు పలకకుండా ఎంఎస్పీ పార్టీ పెట్టి ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని పక్కనపెట్టి ఆ పార్టీని కూడా బలోపేతం చేయకుండా మతతత్వ పార్టీ బీజేపీతో దోస్తీ చేసి, బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై చేస్తున్న దాడులకు మేము వ్యతిరేకిస్తున్నామని మండిపడ్డారు. 30 సంవత్సరాల మాదిగ ఉద్యమకారులు అమరులయ్యారని వారి త్యాగ ఫలితంగానే సుప్రీంకోర్టు నుంచి అనుకూల తీర్పు వచ్చిందన్నారు. వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత ను కల్పిస్తామంటూ పూర్తి మెజార్టీ ఉన్న సమయంలో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆర్టికల్ 341 సవర ణ చేయకుండా కాలయాపన చేస్తూ మాదిగ మాదిగ ఉపకులాల ను మోసం చేసిందని ఆరోపించారు. వర్గీకరణ పోరాటం ఏ ఒక్కరు విజయం కాదని మాదిగ ఉద్యమకారుల విజయమని తెలియజేశారు.

మొక్కులు చెల్లించిన దుబ్బాక ఎమ్మెల్యే సతీమణి మంజులత

- పెద్దగుండవెల్లి ఎల్లమ్మ తల్లికి పూజలు



నవతెలంగాణ దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని పెద్ద గుండవెల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన రేణుక ఎల్లమ్మ తల్లిని మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే సతీమణి కొత్త మంజులత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయతో దుబ్బాక నియోజకవ ప్రజలు సంతోషంగా ఉండాలని, ఎమ్మెల్యే ఎన్నికల్లో అమ్మవారికి మొక్కుకున్న మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే సతీమణి కి బిఆర్ఎస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిన్ని సంజీవరెడ్డి, రాజు, మల్లారెడ్డి తదితరులున్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన వీడ్కోలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిషత్ అభివృద్ధి, మండల పంచాయతీ అధికారులుగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన లక్ష్మప్ప, విష్ణు వర్ధన్, పలువురు పంచాయతీ కార్యదర్శులకు శాలువ కప్పి సన్మానించి మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్ ఘనంగా విడ్కోలు పలికారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ, మున్సిపాలిటీల్లో ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి ధనసరి అనసూయ



నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్

జిల్లాలోని గ్రామ, మున్సిపాలిటీల్లో ప్రతి శుక్రవారం రోజున డ్రైడే నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అదికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ స్వచ్ఛందనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేసినందుకు అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమం ఈ 5 రోజులే కాదు ఇది ఒక నిరంతర ప్రక్రియ. గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేటప్పుడు ప్రజల నుంచి అనేక సమస్యలు బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా ఈ మూడు నెలలు ఫాగింగ్ మిషన్స్, బ్లీచింగ్ పౌడర్ ఎల్లప్పుడూ జీపీ లో ఉంచుకోవాలి. వర్షం నీరు ఎక్కువగా నిలిచే ప్రాంతంలో మోరీలు ఆగిన చోట పెద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. సమాచార మాద్యామాలలో, ఇతర సోషల్ మీడియాలో వస్తున్న సమస్యలను గ్రామాలలో వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని గొప్ప ప్రణాళికతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పురోగతిలో భాగంగా 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళల కొత్త ఎస్‌హెచ్‌జీ బృందాలను ఏర్పరిచే విధంగా డీఆర్డీఏ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందించే ప్రక్రియ సైతం పూర్తి చేసి స్వతంత్ర దినోత్సవానికి వేసుకునే విదంగా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగు నీటి వసతి ఎల్లప్పుడూ గ్రామపంచాయతీ, మండల స్పెషల్ అధికార్లు తరచూ పర్యవేక్షణ చేయాలి. అలాగే పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు పారిశుధ్యం సీజనల్ వ్యాధులు రాకుండా ఎలా ఎదుర్కోవాలి వంటి విషయాలను ఆరోగ్య అలవాట్ల గురించి చెప్పి వాటిని ఇంట్లో సైతం తెలుపాలని సూచించారు. అలాగే గ్రామ నర్సరీలలో పలు రకాల మొక్కలను పెంచాలని సూచించారు. అలాగే నేషనల్ అవార్డ్స్ కోసం జిల్లా నుంచి 3 బెస్ట్ గ్రామాలను ఎంపిక చెయ్యాలని సూచించారు.సమికృత జిల్లా కార్యాలయ సముదాయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఆర్డీఏ పిడి జయదేవ్ ఆర్యా, జెడ్పీ సీఈఓ రమేష్, డీపీఓ దేవకి దేవి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ రవాణా చేస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కొమురవెల్లి

అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని కొమురవెల్లి ఎస్ఐ, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో 16 క్వింటాల్ల 30 కిలోల బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజు గౌడ్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కొము రవెల్లి గ్రామానికి చెందిన కడమంచి మల్లేశం, కడమంచి తిరుపతి, ఎలాంటి అనుమతి లేకుండా తూప్రాన్‌కు చెందిన సందీప్ అనే వ్యక్తికి అమ్ముతున్నారని రేషన్ బియ్యాన్ని సాదినం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు

ముంపు గ్రామాల కల్లు గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి


- జిల్లా ప్రధాన కార్యదర్శి బండకింది అరుణ్ గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

ఆగస్టు 2వ తేదీ నుంచి 18 వరకు అమరుల యాదిలో సిద్దిపేట జిల్లా గీతన్నల చైతన్య యాత్ర గజ్వేల్ పట్టణంలోని మల్లన్న సాగర్ కాలనీ ముంపు గ్రామాలైన వేములఘట్, కిష్టాపూర్, ఎర్రవెల్లి, సింగారం, పల్లెపహాడ్, తదితర గ్రామాల్లో ఉన్న కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లిపాటి కనక గౌడ్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండకింది అరుణ్ గౌడ్ అన్నారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న మల్లన్నసగర్ కాలనీలో కల్లుగీత కార్మికుల సమావేశమై మాట్లాడారు. హక్కుల కొరకు పోరాడి అమరులైన సంఘం నాయకులను యాది చేసుకుంటూ ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి 18న సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర ప్రతి ఏడాది లాగానే అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నమన్నారు. హక్రాజ్ మామ్లాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి సొసైటీలు ఏర్పాటు చేసుకోవడం, నౌకర్ నామా లాంటి చట్టాలను రద్దు చేయించడం, ఎక్స్ గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి, పెన్షన్ తదితర హక్కులు సాధించిన చరిత్ర కల్లు గీత కార్మిక సంఘానికి ఉందని పేర్కొన్నారు. బొమ్మగాని ధర్మబిక్షం, యస్ఆర్ దాట్ల, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, దేశిని చిన్న మల్లయ్య, వర్రెళ్ళి బుచ్చి రాములు, పెరుమాళ్ళ జగన్నాథం, బొలగాని పుల్లయ్య ఘనగాని గౌరయ్య దూడల నరసయ్య అంబటి సత్యనారాయణ లాంటి ఎందరో అమరవీరులు ఉన్నారు. వారిని స్మరించుకుంటూ నేటి తరానికి వారి త్యాగాలను తెలుపుతున్నాం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్న మన్నారు. వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి. సేఫ్టీ మోకులు వృత్తి చేసేవారందరికి ఉచితంగా ఇవ్వాలి. ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష చొప్పన ఎక్స్ గ్రేషియా నెల రోజులలోపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మెడికల్ బోర్డు విదానం తొలగించాలి. వృత్తిలో ఎక్కడ ప్రమాదం జరిగినా వర్తింప జేయాలి. బెల్టు షాపులను పూర్తిగా నిషేదించాలి. కల్లులోని పోషకాలను, ఔషద గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ ఎలాంటి షరతులు లేకుండా 50 ఏళ్ళ నిండిన ప్రతి గీత కార్మికునికి చేయూత పథకం ద్వారా 4వేలు ఇవ్వాలి. కల్లుగీత కార్మికులందరికి వృత్తికి ఉపయోగ పడే ద్విచక్ర వాహనాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి 5వేల కోట్లు కేటాయించి టాడి కార్పోరేషన్‌ని సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి సొసైటికి చెట్ల పెంపకానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని ఉన్న 560 జివో అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పల్లిపాటి కనక గౌడ్, హన్మండ్లకాడి యాదగౌడ్, కిసరి వెంకట్ గౌడ్, సింగారం రవి గౌడ్, మ్యారగొని శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పల్లె రాజు గౌడ్, మ్యారగొని స్వామి, సింగారం భాస్కర్ గౌడ్, సింగారం కిష్ట గౌడ్ సింగారం సాయి గౌడ్, పాల్గొన్నారు.

నేనే డీఐఈఓ అంటే నేనే అని పోటాపోటీ



నవతెలంగాణ-దుబ్బాక

కోర్టు ఆదేశాలతో తనకే డీఐఈఓగా అవకాశం ఉందంటూ హిమబిందు. అధికారికంగా ఆదేశాలు తనకే ఉన్నాయంటూ రవీందర్ రెడ్డి చెప్పుకోవడం. సిద్ధిపేట జిల్లా ఇంటర్ ప్రాంతీయ అధికారిగా ఉండాల్సిన వ్యక్తుల్లో ఇద్దరు తానే డీఐఈఓను అంటే కాదు కాదు తానే అంటూ చెప్తూ పోటా పోటీగా జిల్లాలోని ఇంటర్ కాలేజీలు,మండలాలను పర్యటిస్తున్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించిన జిల్లా ప్రాంతీయ అధికారి (డీఐఈఓ) పదవికి ఇన్చార్జిగా జూనియర్ కళాశాలలకు చెందిన సీనియర్ ప్రిన్సిపాల్‌లను ఈ పోస్టులో నియమిస్తారు. అందులో భాగంగానే తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అధికారికంగా కోహెడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే.రవీందర్ రెడ్డిని సిద్దిపేట జిల్లా ఇన్చార్జి ఇంటర్మీడియట్ విద్యాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయబడ్డాయి. దీంతో ఆయన జిల్లా ఇంటర్ ప్రాంతీయ విద్యాధికారిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఇదే క్రమంలో తనకూ ఆ ఇంచార్జి డీఐఈఓ పోస్టును ఇవ్వాలని చెప్పి కోర్టు ద్వారా తనకు అనుకూలంగా ఆదేశాలు వచ్చినట్లు సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెబుతున్నారు. న్యాయపరంగా తానే ఆ హెూదాలో ఉండాలని చెప్పి మరోపక్క ఆమె కళాశాలని విజిట్ చేస్తుంది. అందులో భాగంగానే మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను హిమబిందు (డీఐఈఓ హెూదాలో) సందర్శించారు. ఇద్దరూ ఉన్నతాధికారులమని చెప్పుకుంటూ విజిట్ చేయడంతో జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలల యాజమాన్యాల ప్రిన్సిపాల్‌లు ఏం చేయాలో. ఎవరి ఆదేశాల్ని పాటించాలో.ఎవరివి పాటించవద్దో. అసలు డీఐఈఓ ఎవరు అన్న అయోమయానికి గురవుతున్నారు. వీరిద్దరి మధ్య నెలకొన్న పోటీ వల్ల జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలల నిర్వహణ సైతం గాలికి వదిలేశారు. అసలు ఆ జిల్లా అధికారి అంటేనే లెక్కలేని తనంగా మారింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వెంటనే స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని. అధికారికంగా అసలు డీఐఈఓ ఎవరు అనేది స్పష్టమైన ప్రకటన చేయాలని పలు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు కోరుతున్నారు.

తల్లితో స్నేహం..పిల్లకు భయం

- భద్ద శత్రువులు మిత్రులైన వేళ
- పిల్లికి, శునకనికి దోస్తీ
- ముక్కుమీద వేలేసుకున్న గ్రామస్తులు
- గజ్వేల్ మండలం బెజగమలో పిల్లి, శునకల దోస్తీ ముచ్చట్లు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

భద్ద శత్రువులుగా ఉండే వారు మిత్రులు అయితే ఆనందమే వేరు. పురాణాల్లో చెప్పినట్లుగా శత్రువుకి శత్రువే మిత్రుడు అన్నట్లుగా ఆ సమయం కనిపించింది. ఎదురుపడితే గాయాలు చేసుకుని రక్తాలు కారే పరిస్థితుల్లో మిత్రులయ్యారు. పా వెళ్దాం ఎక్కడికి అన్నట్లుగా ఒకరి వెనకాల ఒకరు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ సన్నివేశం గజ్వేల్ మండలం బెజగామా గ్రామంలో ఓ పిల్లి మరో శునకం మధ్య కనిపించింది. ఆ సన్నివేశాన్ని చూసిన గ్రామస్తులు ముక్కు మీద వేలు వేసుకొని ఆశ్చర్యాన్ని గురయ్యారు. అటుగా వెళ్లిన నవతెలంగాణ రూరల్ రిపోర్టర్ రమేష్ చెక్కల కెమెరాకి చిక్కింది.



దోస్త్ మేర దోస్త్....

ఎదురుపడితే పోట్లాడు కోవల సిన జంతువులు కలిసి స్నేహం చేస్తున్నాయి. ప్రస్తుతం శునకాల వల్ల మనుషులకే ప్రాణహాని ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో పిల్లితో శునకం దోస్తీ చేస్తుంది. ఎక్కడ వెళ్లిన గల్లీలో నువ్వు ముందు నేను వెనక మేరా దోస్త్ అన్నట్లుగా సన్నివేశం కనిపిస్తుంది. పలువురు వాటిని చూసి మన మనుషుల్లో ఇలాంటి స్వభావం కలగాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు..

తల్లితో శునకం దోస్తీ..పిల్లిపిల్లకు భయం...

తల్లి పిల్లితో శునకం దోస్తీ చేస్తూ సన్నివేశం బాగానే కనిపిస్తుంది. కానీ వెనకాల పిల్లి పిల్లకు భయం వేస్తుంది. శునకం వల్ల నాకు నా తల్లికి ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని పిల్లి పిల్ల ఘర్షిస్తుంది. తల్లితో స్నేహం చేస్తున్న శునకాన్ని చూసి ఆందోళన చెందుతుంది. అదే సమయంలో పిల్లి పిల్ల దగ్గరికి వస్తున్న సమయంలో అరుస్తూ ఆగ్రహిస్తుంది. కాసేపు గర్జించుకొని పిల్లిపిల్ల అక్కడే ఉన్న వేరొక చోటికి వెళ్ళింది. తల్లిపిల్లి మాత్రం పది నిమిషాలు శనకంతో ఉండి, తన పిల్ల వద్దకు చేరుకుంది. శునకం చేసేది ఏమిలేక అక్కడినుంచి వేరొక చోటికి వెళ్లిపోయింది.

ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాం

- సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు శశిధర్ శర్మ




నవతెలంగాణ-వర్గల్

మండలంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో వర్గల్ మండలంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల చౌదర్‌పల్లిలో సభ్యత్వాన్ని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ వర్గల మండలం మాజీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి ప్రారంభించి, వివిధ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ మాట్లాడుతూ ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలన్నీ పీఆర్టీయూ సంఘం పరిష్కరిస్తుందని, 11వ, 12వ జీవోలు సవరింపజేసి నూతనంగా 5,600 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయించి పీఎస్‌హెచ్‌ఎంలు పదివేలకు పెంచి డీఎడ్‌బీఎడ్ అర్హత కలిగిన అందరికీ పదోన్నతులు ఇప్పిస్తామని శశిధర్ శర్మ తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండేట్లు ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండే ట్లు పీఆర్టీయూ సంఘం కృషి చేస్తుందని పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు ఉచిత కరెంటు కూడా పీఆర్టీయూ సంఘం ద్వారానే సాధ్యమైందని శశిధర్ శర్మ తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలోనే పాత పెన్షన్ వర్తింప జీవో ఇప్పిస్తామని సీపీఎస్ రద్దు కోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు బండ నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు వరాల ప్రశాంత్ కుమార్ వంటేరు శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసకావొద్దు


- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం గోవిందా పూర్ గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు వాడకం, మహిళల రక్షణ, షీ టీమ్స్ పనితీరు వంటి అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. యువత చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిసకావద్దన్నారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా దాడుల వెనక హిందూ వ్యతిరేక శక్తుల కుట్ర




నవతెలంగాణ-సిద్ధిపేట

బంగ్లాదేశ్ రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటం పేరుతో తెరవెనుక హిందువులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు వెంటనే స్పందించి హిందువులను రక్షించాల్సిన అవసరం ఉందని తపస్ జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అన్నారు. స్థానిక శిశు మందిర్‌లో బంగ్లాదేశ్ అల్లర్లపై జరిగిన చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో జరిగిన తిరుగుబాటులో మతం ముసుగులో రహస్య ఎజెండా అమలుపరుస్తూ, హిందువులపై దాడి చేసి వారి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటున్నారని అన్నారు. ఇంత జరుగుతున్న దేశంలో పాలక, ప్రతిపక్షాలు ఏవి కూడా నోరెత్తడం లేదని, వెంటనే పౌర సమాజం మొత్తం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. బంగ్లా దాడుల వెనుక అంతర్జాతీయ కుట్ర కూడా ఉందని, ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా కూడా తెలిపారని, అంతర్జాతీయ సంస్థలు పౌర సమాజం వెంటనే స్పందించి వారికి రక్షణగా నిలిచి, వారికి మనోధైర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ఇజ్రాయిల్ దాడులపై స్పందించే మేధావులు బంగ్లాదేశ్ దాడులపై స్పందించకుండా మౌనం వహించడం వారి ద్వంద వైఖరికి నిదర్శనం అని అన్నారు. వారు మేధావులు కాదని, మేధావుల ముసుగులో ఉన్న మేత ఆవులని, విదేశీ శక్తులు వేసే మేతకు ఆశపడి హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల గుడ్డివారిగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వెంటనే అంతర్జాతీయ సమాజం, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి హిందువుల పై దాడులకు పాల్పడుతున్న మతోన్మాద శక్తులకు తగిన గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, జిల్లా ఉపాధ్యక్షులు వైవి శశికుమార్, గుండా వేణు, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, లింగమూర్తి, లోకేష్, వివిధ మండల అధ్యక్ష కార్యదర్శులు జైపాల్, రాములు, శ్రీశైలం, వెంకటరామిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టిన అధికారులు


- గామసభలో రసభాస
- సంబంధిత అధికారులపై చట్టరీత్యా చర్యలు



నవ తెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని మంగోల్ గ్రామంలో గ్రామ పంచాయితీ నిధులు దుర్వినియోగం జరగడంతో జిల్లా డిఆర్డిఏ అడిషనల్ పిడి బాలకృష్ణ మంగళవారం రోజున గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామ సభ నిర్వహించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు . అనంతరం డిఆర్‌డిఏ అడిషనల్ పిడి పంచాయతీ రికార్డులను ఎంపిడిఓ వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేయగా పంచాయితీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్‌లు ఫోర్జరీ చేసిన రికార్డులు చూపించి మభ్య పెట్టడానికి చూసారన్నారు . అధికారుల విచారణలో సుమారు 3 లక్షల 52 వేల రూపాయలు దుర్వినియోగం అయినట్లు తెలిసింది. దీంతో నిలదీసిన అధికారులకు మరో పదిహేను రోజులలో దుర్వినియోగం జరిగిన నిధులను తిరిగి కడతామని ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు . ఈ సందర్భంగా డిఆర్డిఏ అడిషనల్ పిడి మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధుల ను తిరిగి పంచాయతీ అకౌంట్లో జమ చేయించి , పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు

పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరం



నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తాజా మాజీ ఎంపీటీసీల ఫోరం దౌల్తాబాద్ మండల అధ్యక్షులు బండారు దేవేందర్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన శివంది రమేష్ రూ.54 వేలు, శివంది పెద్ద పెంటయ్య రూ.37,500 వేలు, మరగొని సంతోష్ రూ.18 వేలు, నల్క కరుణాకర్ రూ.15 వేలు, నందిని గౌడ్ రూ.35 వేలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారని. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం ప్రగతి బాటలో నడిచినట్లని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యానికి గురైట్క ప్రాణాలను పోగొట్టుకోవద్దన్న సంకల్పంతో వారి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆదుకోవడం కోసం సీఎం సహాయనిధి చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా సరే అనారోగ్యానికి గురైనప్పుడు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, గ్రామ అధ్యక్షులు రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు జనగామ వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ నీరుడి రాజనర్సు, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు బాధతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-తొగుట

అప్పులు బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుడికందుల గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం మిరుదొడ్డి ఎస్ఐ పర్శ రాములు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తుంకుంట్ల కృష్ణారెడ్డి (46) గ్రామంలో ఇల్లు నిర్మాణానికి, ఫర్టిలైజార్ షాప్ కొరకు తనకు తెలిసిన వారి వద్ద సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. మిరుదొడ్డి యూనియన్ బ్యాంకులో గృహం తనక పెట్టి రూ. 10 లక్షల లోన్ తీసుకున్నాడు. ఈ అప్పుల గురించి అప్పులు ఇచ్చిన వారు, బ్యాంకు మేనేజర్ గత కొంత కాలం గా ఇబ్బందులకు గురించేస్తుండగా మనస్తపం చెంది సోమవారం రోజున తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే ములుగు ఆర్విఎం ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మందాపూర్ గ్రామానికి చెందిన లింగాల యాదగిరి తుంటి ఆపరేషన్ కోసం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన యాదగిరికి అంత ఖర్చు పెట్టే స్థోమత లేదు. ఇదే విషయాన్ని మాజీ పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకపోగా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి దృష్టికి తీసుకపోగా, నర్సారెడ్డి మంత్రి కొండ సురేఖ సహకారంతో యాదగిరి చికిత్స నిమిత్తం రూ.రెండున్నర లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేశారు. మంజూరైన ఎల్‌ఓసీని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డితో కలిసి మాజీ పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి అందించారు. అందించిన వారిలో నాయకులు అమర రాము, దుర్గయ్య, పరమేశ్వర్, నరేశ్ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ నీటి కోసం పైపులు వేశారు

- కాలువను పూడ్చడం మరిచారు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం వేచరేణి గ్రామంలోని హైస్కూల్ పక్క వీధిలో 15 రోజుల క్రితం మిషన్ భగీరథ నీటి కోసం కాలువ తీసి పైప్ లైన్ వేశారు. పైప్ లైన్ వేసి దాదాపు వారం రోజులు గడుస్తున్నప్పటికీ కాలువను పూడ్చక పోవడంతో అటు వైపు వెళ్లే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలువను పూడ్చి వేయాలని గ్రామస్తులు మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి తక్షణమే కాలువను పూడ్చి వేసి దారిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన ఎంఆర్పీఎస్ నాయకులు



నవతెలంగాణ-కొండపాక

ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈనెల ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ, సమాజమంతా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ మంద కృష్ణ మాదిగ హైదరాబాద్ గడ్డమీద అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించే విజయోత్సవ ర్యాలీకి సిద్దిపేట నుంచి ఎంఆర్పీఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బాకి ప్రభాకర్ ,పెరిక పరశురాములు, పెద్దమాతరి బాబు, సామ్రాట్ ప్రకాష్, జేరిపోతుల లక్ష్మణ్, పిన్నింటి శ్రీహరి సింధు, బింగి రాజేష్ ,దబ్బెట దర్శన్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాకేష్, పల్లె బాబు, తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో బందు ప్రశాంతం



నవతెలంగాణ-సిద్దిపేట/గజ్వేల్

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఇతర సామాజిక వర్గాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో సిద్దిపేట, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మంగళవారం బంద్ నిర్వహించారు. అఖిలపక్ష ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీ ఆర్ ఎస్, బీజేపీ, హిందూ సంస్థల ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. గజ్వేల్ పట్టణంలోని అంగడి హనుమాన్ నుంచి కోర్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక వ్యాపారులు సైతం బందుకు సహకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

నంగునూరు మండల ఎస్టీటీయూ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం సెకండియర్ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని మంగళవారం ముండ్రాయి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గత బదిలీలలో ప్రమోషన్లలో ఎస్టీటీయూ ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని చర్చించారు. ఎగ్జీట్ ఉపాధ్యాయుల పట్ల, వివిధ ఉపాధ్యాయ సంఘాల ధమన నీతిని ఖండించారు. ఎస్టీటీయూ నూతన నంగునూరు మండల కమిటీ గౌరవ అధ్యక్షునిగా వి.రాజిరెడ్డి, అధ్యక్షునిగా బి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వి. శ్రీనివాసరెడ్డి, మహేందర్ రెడ్డి, కోశాధికారిగా జి గోవర్ధన్, మీడియా సలహాదారునిగా గడిల శ్రీకాంత్ ఎన్నుకున్నారు.

విద్యార్థులకు భోజన పళ్లెం వితరణ



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని చంద్ ఖాన్ మక్త ప్రాథమిక పాఠశాలలో చదివే 45 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్, గజ్వేల్ స్నేహ వారి ఆధ్వర్యంలో భోజన పళ్ళాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మల్లేశం, సత్యనారాయణలు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో విద్యార్థులకు మరిన్ని సేవ కార్యక్రమాలు అందజేస్తామని అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులకు పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు కనకరాజు, ప్రశాంత్ కుమార్, సుమన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ



నవతెలంగాణ-తొగుట

మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన అలి మెల్లి బాలరాజ్ బీజేపీ నాయకులు పరామర్శించారు. మంగళవారం ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని పరామర్శించి బియ్యం అందజేశారు. వారి కుటుంబానికి ఎంపీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొగుట గ్రామ బూతు అధ్యక్షులు రాజిరెడ్డి, బాల్ రెడ్డి, లింగం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి సుబ్రహ్మణ్యం సర్ప నందీశ్వర విగ్రహం ప్రతిష్ట



నవతెలంగాణ-సిద్దిపేట

భారత్‌నగర్‌లోని శ్రీ యోగి లింగేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు చందోది కిరణ్ శర్మ వారి ఆధ్వర్యంలో హెూమము, పూజలు ప్రత్యేకతో గణపతి సుబ్రహ్మణ్యం సర్ప నందీశ్వర విగ్రహం ప్రతిష్ట మహెూత్సవం అంగరంగ వైభవంగా మంగళవారం జరిగింది. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రత్యేక పూజలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చేర్యాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ



నవతెలంగాణ-చేర్యాల

హర్ ఘర్ తిరంగ్ యాత్రలో భాగంగా మంగళవారం చేర్యాల పట్టణంలోని గాంధీ సెంటర్ నుంచి అభయాంజనేయ స్వామి దేవాలయం వరకు వివిధ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. అంతకుముందు స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి పూల మాల వేసి వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్నె సత్య వర్ధన్, బూరుగు సురేష్, కాశెట్టి పాండు, రాందాస్, సంజీవరెడ్డి, మహేందర్ రెడ్డి, బాల నరసయ్య, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-నంగునూరు

క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండి.ఆసీఫ్ అన్నారు. మంగళవారం నంగునూరు మండలం రాజగోపాల్ పేట ఎస్ఐ ఎం.డి.అసీఫ్ తన సిబ్బందితో కలసి నంగునూరు జూనియర్ కళాశాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గంజాయి, డ్రగ్స్ ,సైబర్ క్రైమ్స్ లాంటి మీద అవేర్ నెస్ ప్రోగ్రాంలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన నాయకులు



నవతెలంగాణ-బెజ్జంకి

ఎస్సీ వర్గీకరణ సాధనకు అలుపెరగని పోరాటం చేసి హైదరాబాద్ యందు నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీలో పాల్గొననున్న మంద క్రిష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి మండలంలోని అయా గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు.

ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగురవేయాలి

- హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

మిరుదొడ్డి మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి పూలమాలవేసి నివాళులు అర్పించరు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల పార్టీ అధ్యక్షులు లింగాల సదానంద రెడ్డి, బీజేపీ నాయకులు కుమ్మరి సురేష్, పెద్దకుర్మ కరుణాకర్ మాట్లాడుతూ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బ్రిటిష్ పాలకులను మిరుదొడ్డి స్వాతంత్ర సమరయోధులను ఈనాటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ప్రతి ఒక్కరి ఇంటి పైన మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని మన దేశ ఐక్యతను దేశ సమగ్రతను కాపాడాలని కోరారు. భావి భారత పౌరులు అయినటువంటి యువకులు రేపటి భవిష్యత్ తరాల కోసం దేశభక్తిని నింపేలా జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రోశయ్య, సీనియర్ నాయకులు మొగుళ్ల మల్లేశం, బీజేవైఎం మండల అధ్యక్షులు లింగాల సదానంద రెడ్డి, కమ్మరి స్వామి, ఉప్పే కనకయ్య బయ్యారం రమేష్ , బోయిని చంద్ర కుమార్, మంగోలి యాదగిరి, గోట్టం రవి, నక్క రాములు, పూసరాజు, మొగుల రాజు, చాట్లపల్లి శివ, నర్మలమధు, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని పెరకబండ గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. డాక్టర్ స్వాతి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నవీన, బాలవికాస ప్రతినిధులు అన్నామేరీ, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మాలతి సహకారంతో సమకూర్చిన క్రీడా దుస్తులను మంగళవారం ఎమ్మెల్సీ కూర నరోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలని, చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్, రాజిరెడ్డి, వెంకటరమణ, హేషమ్, మాధురి,మల్లేశం, నరేష్ రెడ్డి ఉపేందర్, అష్రఫ్, గంగలక్ష్మి నర్సింలు అధ్యాపకేతర బృందం రాజు, భవానీప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ సమైక్య ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణం వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు సమైక్య ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేష్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఎన్నో విజయాలు సాధించిందని ఏఐఎస్ఎఫ్ జిల్లాధ్యక్షుడు సంగం మధు కొనియాడారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర ఇంటర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థికి ఎంతో కీలకమైందన్నారు. కష్టపడి చదివి మంచి మార్కులు సంపాదించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్‌ల బృందం, సిబ్బంది అనంతరాజు శర్మ, రాజు, శ్రీశైలం, ప్రభాకర్, అభిలాష్, అశోక్, సిద్దయ్య, శారద, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పల్ ఆలయంలో శ్రావణమాస పూజలు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలోని కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వయంభు లింగంగా వెలసిన స్వామివారికి జలాభిషేకాలు ఆకుల పూజ, అన్న పూజ, తదితర పూజలు వేద బ్రహ్మణ పండితుల మంత్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పేట పట్టణానికి చెందిన గడ్డం వెంకటేశం, మల్లేశంలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పద్మ, బాపిరాజు, సీతారామారావు, గాండ్ల సంగమేశ్వర్, సతీష్ గౌడ్, మురళీ అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిఖిల్ కుటుంభాన్ని ఆదుకుంటాం

-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

డెంగ్యూతో ఇటీవల కుమ్మరి నిఖిల్ మరణించడం దురదృష్టకరమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మండలంలోని సూరారం గ్రామంలో కుమ్మరి వెంకటేశం కుమారుడు డెంగ్యూ జ్వరంతో శస్త్ర చికిత్స పొందుతూ ఇటీవల మరణించడం దురదృష్టకరమన్నారు. మంగళవారం సూరారం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కుమ్మరి నిఖిల్ నివాసంకు వెళ్ళి కుటుంభ సభ్యులను ఓదార్చారు. నిఖిల్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామినిచ్చారు. అదే గ్రామానికి చెందిన ఫసియోద్దిన్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఫసియోద్దిన్ కుటుంభాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వారి పిల్లల పేరా రూ.25 వేలు చొప్పున ఫిక్స్ డిపాజిట్ చేయిస్తానని హామినిచ్చారు.

ఘనంగా మంగళ గౌరీ వ్రతము



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శక్తి మహిళా శక్తి సముఖ సభ్యులందరూ కలిసి మంగళ గౌరీ వ్రతం కార్యక్రమంను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో మాతృ శక్తి మహిళల ఆధ్వర్యంలో మంగళ గౌరీ వ్రతం చేపట్టామని, ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. హిందూ సాంస్కృతి సాంప్రదాయాల ఆచారాలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులకు గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మలూరి పావని, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పబ్బ సత్యనారాయణ జిల్లా మాతృ శక్తి సంయోజక అధ్యక్షులు గోపిశెట్టి అనంతలక్ష్మి, పబ్బా చంద్రకళ, జిల్లా విభాగ సంయోజక కార్యదర్శి పుట్టి మల్లేశం, మండల విభాగ కార్యదర్శి తిరుపతి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జిపి స్వామి, బట్ట మహేష్, గ్రామ మహిళలు అనూష లక్ష్మీ నర్సింలు, వినోద వెంకటేశం, శోభ, తదితరులు పాల్గొన్నారు.

మండలం వేరు చేయాలని మెదక్ ఎంపీకి వినతి



నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు పాపన్నపేట మాజీ బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి ఆధ్వర్యంలో మండల విభజన కొరకు మంగళవారం వినతి పత్రం అందించారు. పాపన్నపేట మండలం 58 బూతులతో అతిపెద్ద మండలం గా విస్తరించి ఉంది అందువలన పరిపాలనా పరమైన ఎన్నో ఇబ్బందులను మండల ప్రజలు ఎదుర్కొంటున్నారు. మండలాన్ని రెండుగా విభజించాలని వనదుర్గ మండలం ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని తద్వారా ఎల్లాపూర్, శానాయిపల్లి, తుమ్మలపల్లి, పోడిచన్పల్లి, ఏడుపాయల కమాన్ లక్ష్మీ నగర్, గందర్ పల్లి, జయపురం, కొత్తపల్లి, యూసుఫ్ పేట, ఆరేపల్లి, అన్నారం, అబ్లాపూర్, చిత్రయాల్, ఎన్కేపల్లి, గాజుల గూడెం, కొడపాక, షేర్ పల్లి, నాగ్సన్ పల్లి, లాంటి 20 గ్రామాలకు లబ్ధి జరుగుతుంది. మండల కేంద్రానికి ఏ పని కోసం పాపన్నపేట వెళ్లాలన్నా విద్యార్థులకు రైతులకు హాస్పిటల్ పోలీస్ స్టేషన్ విధంగా ఏ రకమైన పని కోసం వెళ్లాలన్నా సుమారు 20 కిలోమీటర్స్ వెళ్ళవలసి వస్తుంది. గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. మండలాన్ని విభజించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నప్పటికీ అధికారులు నాయకుల అలసత్వం వలన అది పెండింగ్లోనే ఉండిపోయింది. కావున సత్వరమే అందరికీఆమోదయోగ్యమైనటువంటి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న ఏడుపాయల వన దుర్గ మాత పేరు మీద మండలాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి, పొడ్చన్‌పల్లి మాజీ సర్పంచ్ సంజీవులు, బీజేవైఎం మండల అధ్యక్షులు జగదీష్, షేర్ పల్లి బూత్ అధ్యక్షులు నర్సింలు, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగాల దేవాలయంలో లక్ష బిల్వార్చన



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని జ్యోతిర్లింగాల దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు మంగళవారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ముడుపతి రాజ్ కుమార్ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, బిల్వార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వినోద్ నాయక్ సేవలు అభినందనీయం



నవతెలంగాణ- కొల్చారం

బీఆర్ఎస్ నాయుడు, మాజీ ఉపసర్పంచ్ వినోద్ నాయక్ చేసిన సేవలు అభినందనీయమని దేశ్య తండా ప్రాథమిక పాఠశాల సిబ్బంది అన్నారు. మంగళవారం మండలంలోని దేశ్య తండా ప్రాథమిక పాఠశాలలో వినోద్ నాయక్ కుమారుడు వరుణ్ తేజ్ జన్మదినం సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్స్ బహుకరించడం సంతోషకరమన్నారు. అనంతరం తోటి విద్యార్థినీ విద్యార్థులు వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకుని స్నేహితునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తండా ప్రజలు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాలపల్లిలో గత ప్రభుత్వంలో అమలు అయినటువంటి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కౌన్సిలర్ బొంది అరుణ వెంకట గౌడ్ సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న లంబ నవీన్ రూ 24,500, మట్టెల హరీష్ రూ.45వేలు, పిల్లుట్ల నాగయ్య రూ 60వేలు, లంబ నర్సింలు రూ.30వేలు, లంబ అంజమ్మ రూ.48వేలు, లంబ శ్రీధర్ రూ.60వేలు, మన్నె నందు రూ.22,500 ల మొత్తాన్ని ఏడుగురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాలపల్లి బీఆర్ఎస్ అధ్యక్షులు లంబరాజు యాదవ్, బత్తుల నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక మాతా అభిషేకం



నవతెలంగాణ-కొల్చారం

రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో పంటలు సుభిక్షంగా పండి అందరు సంఖసంతోషాలతో ఉండాలని కొల్చారం గ్రామానికి చెందిన పాలాట హేమలత, అశోక్ గౌడ్ దంపతులు అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్చారంలోని రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో రేణుక ఎల్లమ్మ అభిషేక, అలంకరణ, అర్చన కార్యక్రమం మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమా రాజగౌడ్, రామకృష్ణ గౌడ్, నాగభూషణం, అశోక్ గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ- నార్సింగి

ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టగా, వాహనదారునికి గాయాలైన సంఘటన మండల పరిధి జాతీయ రహదారి 44 శంఖాపూర్ గేట్ వద్ద జరిగింది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన షేక్ యూసఫ్ తండ్రి షేక్ మదార్ బ్రతుకు తెరువు కోసం మండలం లోని జప్తి శివునూర్‌లో ఉంటూ రాయిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1 గం లకు నార్సింగిలో తన స్వంత పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి బయలుదేరుతూ శంఖాపూర్ గేట్ వద్ద కు చేరుకోగానే వెనుక వైపు నుంచి టాటా పంచ్ కారును సంజీవ్ గాంధీ నగర్, జీడిమెట్ల, హైదరాబాద్ నివాసి బండ్ల మహేష్ అజాగ్రత్తగా నడుపుతూ బలంగా ఢీ కొట్టాడు. కారుతో ఢీ కొట్టడం వల్ల యూసఫ్ తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి ముఖం, ఎడమ భుజం, ఎడమ కాలుకి గాయాలు అయ్యాయి. యూసఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్ తెలిపారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు


-ఉత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి,
-కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి రాజిరెడ్డి,
-పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

శివ్వంపేట మండలం కొంతంపల్లి గ్రామంలో గల దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా సోమవారం పీఏసీఎస్ చైర్మెన్ చింతల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాలలో ఇలాంటి ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండి పంటలు పండించి మంచి లాభాలు పొందేలే అమ్మవారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ప్రజల పైన ఉంటుందని వారు గుర్తు చేశారు. అదేవిధంగా పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత ఏడు ఏళ్ల కాలం నుంచి దుర్గామాతకు ఎలాంటి పూజలు నిర్వహించలేదని ఈ ఉత్సవాలు మొదటిసారి నిర్వహించుకోవడం గ్రామ ప్రజలతో పాటు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు. బండ్ల ఊరేగింపుతో గ్రామంలో భారీ ఊరేగింపుతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, లక్ష్మీ కాంతారావు, జ్యోతి సురేష్ నాయక్, లలితా నర్సింగ్ నాయక్ శ్రీనివాస్ గౌడ్ ఆంజనేయులు గౌడ్, గుర్రాల మల్లేశం, అశోక్, మణిదీప్, నవీన్ గుప్తా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలి వెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు



నవతెలంగాణ-చేగుంట

మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఢిల్లీ నుంచి వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు మంగళవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. 30 ఏళ్ల ఏబీసీడీ వర్గీకరణ పోరాటం సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణ సాధించుకొని తిరిగి వస్తున్న ప్రియతమ నాయకుడు మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు వెళ్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.

ఇంటర్మీడియట్ నోడల్ అధికారికి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులుఎస్, శ్రీకాంత్ (జువాలజీ), రమేష్ (బోటనీ), ఏలేందర్(ఎకనామిక్స్), ఎస్.సందీప్ గౌడ్(పొలిటికల్ సైన్స్), డీ.ఐ.ఓ కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మి, సాయి తదితర సిబ్బంది డీ. ఐ.ఓ సత్య నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి 63వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలానే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని తెలిపారు.